శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



పంజాబ్ గ్రామాలలో బిజెపికి 'నో ఎంట్రీ'

3లో

శుక్రవారం | 17-05-2024 | హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 327 | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

## అకాల వర్షం...

# భాగ్యనగరం తడిసిముద్ద





- గంటకుపైగా కుండపోత
- వాగులను తలపించిన రోడ్లు
- గంటల తరబడి ట్రాఫిక్‌జామ్
- నగరాన్ని కమ్మేసిన మేఘాలు
- రాష్ట్రంలో పలు జిల్లాల్లోనూ భారీ వర్షాలు
- పిడుగుపాటుకు ముగ్గురు మృతి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారడంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసాయి. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని, కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. అకాల వర్షాలతో రోడ్లపై నీరు చేరి వాహనదారుల ప్రయాణాలకు అంతరాయం కలిగించింది. హైదరాబాద్‌లో వర్షం బీభత్సం సృష్టించింది. మెదక్ జిల్లా నర్సాపూర్ పాపన్నపేటలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. సంగారెడ్డి పట్టణంలో దాదాపు అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో డ్రైనేజీలు పొంగి నీరు రోడ్లపై నిలిచింది. కోహిర్ మండలంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. మండలంలోని కోహీర్, బిలాల్ పూర్, మనియార్ పల్లి, సజ్జాపూర్, బడంపేట్ గ్రామాల్లో వాన దంచి కొట్టింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మామిడి, అరటి, బొప్పాయి తోటలకు నష్టం వాటిల్లింది. బిలాల్ పూర్‌లో కొద్దిసేపు రాళ్ల వాన కురిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగానూ భారీ వర్షాలు కురిశాయి. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజ్‌పల్లిలో పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్‌లో పిడుగుపాటుకు రామడుగు చంద్రయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. పలు చోట్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రైతులు విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ సమీపంలో పిడుగు పడి ఒకరు మృతిచెందారు. ఈ ఘటనలో మరొకరికి గాయాలయ్యాయి.

**రాజధానిలో కుండపోత** : హైదరాబాద్‌లో వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షంతో వర్ష బీభత్సానికి అతలాకుతలమైంది. అత్యవసరమైతేనే బయటకు రావాలని జిహెచ్‌ఎంసి అధికారులు హెచ్చరికలు

తరువాయి 2లో

### మూడు రోజులు భారీ వర్షాలు

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. గురువారం రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలతో పాటు భారీ వర్షాలు కురుస్తాయన్నారు. శుక్రవారం, శనివారం ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కరిసే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ అధికారులు పలు జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ మేరకు ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు. మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి,

తరువాయి 2లో

## లక్ష్యం నిర్దేశించుకుని రాబడి సాధించాలి



- రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ముందుకెళ్లాలి
- అవసరమైన సంస్కరణలు చేపట్టాలి
- భూముల మార్కెట్ విలువలకు సవరణ చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, పన్నుల ఎగవేత లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అవసరమైన సంస్కరణలు చేపట్టాలని ఆదేశించారు. శాఖాపరమైన లొసుగులు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గత ఏడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెలా ఆదాయ పెంపును సమీక్షించుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. బడ్జెట్‌లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే మంత్లీ టార్గెట్‌ను నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రాష్ట్రానికి రాబడి తెచ్చిపెట్టే జిఎస్‌టి ఎగవేత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిఎస్‌టి కలెక్షన్ పెంచేందుకు పక్కాగా ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్, ఆడిటింగ్ జరగాలని సూచించారు. జిఎస్‌టి ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. వాణిజ్య శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కావద్దని, జిఎస్‌టి రిటర్న్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి అక్రమాలకు తావు లేకుండా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్‌లో మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినా లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సిఎం ఆరా తీశారు. అక్రమంగా మద్యం రవాణా, పన్ను ఎగవేత లేకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, కానీ అదే స్థాయిలో రెవెన్యూ రాబడుల్లో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరగలేదన్నారు. చాలా

తరువాయి 2లో

## ఐదేళ్లలో... ఐదుగురు ప్రధానులు

- ఇదే 'ఇండియా' కూటమి ఆలోచన..
- ప్రధాని మోదీ వ్యాఖ్యలు



**ప్రతాప్‌గఢ్ (యుపి):** ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులను చేయాలని 'ఇండియా' కూటమి ఆలోచిస్తున్నదని ప్రధాని నరేంద మోదీ వ్యాఖ్యానించారు. వరుసగా మూడోసారి విజ యం సాధించడం సాధ్యం కాదన్న అనుమానమో లేక ప్రతిపక్ష కూటమిని ఎద్దేవా చేయాలన్న అభిప్రాయమో తెలియదుగానీ, ప్రధాని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. బిజెపి అభ్యర్థికి మద్దతుగా గురువారం ఇక్కడ జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మోదీ మాట్లాడుతూ, 'ఇండియా' కూటమి స్థిరమైన పాలన అందించలేదని, ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులను చేయాలని కోరుకుంటున్నదని అన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు అనంతరం చాలా విషయాలు జరుగుతాయని అన్నారు. 'ఇండియా' కూటమి విచ్ఛిన్నమవుతుందని జోస్యం చెప్పారు. ఓటమి అనంతరం వారు బలిపశువు కోసం చూస్తారని అన్నారు. తమ ప్రసంగంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌పై మరోసారి విరుచుకుపడ్డారు. 'ఢిల్లీ, లక్నో షెహజాదే' (ఢిల్లీ, లక్నో యువరాజులు) అంటూ మోదీ వారిని సంబోధించారు. వాళ్లిద్దరూ వేసవి సెలవుల్లో విదేశాలకు బయలుదేరుతారని అన్నారు. మంగారు చెంచాతో పుట్టిన వాళ్లకు దేశాన్ని నడపడం సాధ్యం కాదని మోదీ ఎద్దేవా చేశారు. అమేథీ నుంచి వెళ్లిపోయిన రాహుల్ ఇక రాయ్ బరేలీ నుంచి కూడా వెళ్లిపోతారని అన్నారు. మొత్తం మీద 'ఇండియా' కూటమిపై విమర్శలు ఎక్కుపెట్టినప్పటికీ, అధికారంలోకి వస్తుందేమోనన్న అనుమానం ప్రధానిలో మొదలైనట్టు కనిపిస్తున్నది. అందుకే, తొలిసారి 'కూటమికి అధికారం' అనే కోణంలో వ్యాఖ్యలు చేసి ఉంటారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

**సిఎఎపై కాంగ్రెస్, ఎస్‌పి అబద్ధాలు**

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

తరువాయి 2లో



## దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి

# బిఆర్‌ఎస్ నిరసనలు

**హైదరాబాద్ :** సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో కాంగ్రెస్ సర్కార్‌పై భారత రాష్ట్ర సమితి పోరు బావుటా ఎగరేసింది. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగిస్తోందంటూ నిరసన బాట పట్టింది. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసించాలన్న కెసిఆర్ పిలుపుతో బిఆర్‌ఎస్ శ్రేణులు రోడ్డెక్కాయి. మాజీ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ర్యాలీ అనంతరం రోడ్డుపై వడ్లను పోసి నిరసన తెలిపారు. సన్నాలకు మాత్రమే బోనస్ చెల్లిస్తామంటోందంటూ ఆసిఫాబాద్‌లో నల్ల జెండాలు ప్రదర్శించారు. నిర్మల్ జిల్లాలో గులాబీ శ్రేణుల రాస్తారోకో వల్ల రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నిజామాబాద్, బాల్కొండలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయం ముందు బిఆర్‌ఎస్ శ్రేణులు ధర్నాకు దిగాయి. ఇప్పటికీ పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదంటూ నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీత రెడ్డి, గజ్వేల్‌లో వంటేరు ప్రతాప్ రెడ్డి ఆందోళన నిర్వహించారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలో ఐకెపి కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నిరసన తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేయాలంటూ మంథని, మెట్‌పల్లిలో కార్యకర్తలు ధర్నా చేశారు. రైతులకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ తుంగలో తొక్కిందని హుస్నాబాద్‌లో వొడితెల సతీశ్ కుమార్, గోదావరిఖనిలో కోరుకంటి చందర్ ఆరోపించారు. పెద్దపల్లిలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. కరీంనగర్‌లో రైతులకు మద్దతుగా నిరసన చేపట్టిన మాజీ మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, రైతులకు

తరువాయి 2లో

## సమాయత్తమవ్వండి


- ఖరీఫ్‌కు నిర్దిష్టమైన కార్యాచరణతో సిద్ధమవ్వాలి
- రుణమాఫీ పథకం, పంటల బీమా సమగ్ర విధివిధానాల రూపొందించాలి
- విత్తనాలు, ఎరువులు సరఫరాపై పూర్తి స్థాయి పర్యవేక్షణ
- అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న ఖరీఫ్ సీజన్ –2024కు సంబంధించి నిర్దిష్టమైన పూర్తిస్థాయి కార్యాచరణతో సమాయత్తంగా ఉండాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం సచివాలయంలో మంత్రి తుమ్మల వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పంటల బీమా, రైతు రుణమాఫీ పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పంటల బీమా విధివిధానాలకు సంబంధించి టెండర్లలో పేర్కొనే నిబంధనలు, ముందుకు వచ్చే కంపెనీలకు ఉన్న అర్హతలు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, రైతులు పంట నష్టపోయిన సందర్భంలో ఈ బీమా పథకం వారిని ఆదుకునే విధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పంటల బీమా పథకం అమలుకు ఆదర్శ రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై సరఫరాకు విధివిధానాలను రూపకల్పన చేసి వెంటనే సరఫరా ప్రారంభించాలని, సరఫరాలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని టిఎస్ సీడ్స్ అధికారులను అదేశించారు. మొదటి విడత పంటనష్ట పరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తి కావడంతో రెండోవిడత (ఏప్రిల్‌లో) మూడో విడత (మేలో) జరిగిన పంట నష్టాలకు సంబంధించి సమాగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. మట్టి నమూనా పరీక్షా కేంద్రాల సామార్థ్యానికి అనుగుణంగా వెంటనే రైతుల విజ్ఞప్తి మేరకు అవసరమున్న రైతుల

తరువాయి 2లో





## 'టిఎస్' స్థానంలో 'టిజి' అమలు

గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర ప్రభుత్వం

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లలో రాష్ట్ర కోడ్‌గా 'టిఎస్' స్థానంలో 'టిజి' అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉపరితల రవాణా

తరువాయి 2లో

## ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరిస్తే..

# ఇడి అరెస్టు చేయొద్దు

సుప్రీంకోర్టు కీలక తీర్పు



**న్యూఢిల్లీ :** మనీలాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు వెలువరించింది. మనీలాండరింగ్ ఫిర్యాదుపై ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించిన తర్వాత ఆ కేసులో నిందితుడిని ఇడి అధికారులు అరెస్టు చేయకూడదని వెల్లడించింది. ఒకవేళ సదరు నిందితుడిని కస్టడీలోకి తీసుకోవాలంటే దర్యాప్తు సంస్థ ప్రత్యేక కోర్టు అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. 'పిఎంఎల్‌ఎ చట్టం సెక్షన్ 44 కింద దాఖలైన మనీలాండరింగ్ ఫిర్యాదులను ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరిస్తే గనుక.. ఆ కేసుల్లో నిందితుడిగా చూపించిన వ్యక్తిని సెక్షన్ 19 కింద అరెస్టు చేసే అధికారం ఇడికి ఉండదు. ఈ కేసులో ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్లకు నిందితుడు న్యాయస్థానం ఎదుట హాజరైతే దాన్ని కస్టడీలో ఉన్నట్లుగా పరిగణించకూడదు. ఒకవేళ తదుపరి విచారణ కోసం ఆ వ్యక్తిని ఇడి కస్టడీకి

తరువాయి 8లో

## 5న రెండు ముక్కలుగా బిజెపి

మహారాష్ట్ర మాజీ సిఎం ఉద్ధవ్ థాక్రే సంచలన వ్యాఖ్యలు



**మహారాష్ట్ర :** జూన్ 5వ తేదీన బిజెపి రెండు ముక్కలు కానుందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే సంచలన వ్యాఖ్యలు చేశారు. నాసిక్‌లో జరిగిన ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ నరేంద్ర మోదీ ఇకపై ప్రధాన మంత్రిగా ఉండబోరని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెల్లడైన మరుసటి రోజే జూన్ 5న బిజెపి రెండు ముక్కలు కానున్నదని చెప్పారు. కాంగ్రెస్‌లో మా పార్టీ కలుస్తుందని అంటున్నారని, తాను మాత్రం బిజెపి గురించే ఆందోళన చెందుతున్నానని

తరువాయి 8లో

## పచ్చిమిర్చి ధర పైపైకి..



- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120
- పెరటి సాగుపై దృష్టి ఏది ?

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

రోజురోజుకీ కొండెక్కుతున్న కూరగాయల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు కిలో రూ.60కి పైనే పలుకుతున్నాయి. పచ్చిమర్చి ధర ఏకంగా ఎన్నడూ లేని విధంగా కిలో రూ.120కి చేరి కూర్చుంది. నెల రోజుల క్రితం

తరువాయి 8లో

## ప్రముఖ జర్నలిస్టు జమోరాకు జైలు నుండి విముక్తి



**గ్వాటెమాల సిటీ :** ప్రపంచ ప్రముఖ జర్నలిస్టు, అనేక అంతర్జాతీయ అవార్డులు పొందిన గ్వాటమాలా దేశ కలం యోధుడు జోస్ రూబెన్ జమోరా జైలు నుండి విడుదలయ్యారు. గ్వాటెమాలా దేశాధ్యక్షుడు అలెజాండ్రో గియోమత్తయ్ సారథ్యంలోని ప్రభుత్వ అవినీతిపై అలుపెరుగని పోరాటం చేస్తున్న జమోరాపై కక్షసాధింపుతో ఆయననే మనీలాండరింగ్ కేసుల్లో నిందితుడుగా ఇరికించింది. 2023 జూన్ 15న ఆయనకు ఆరేళ్ళ జైలుశిక్ష పడేట్టు చేసింది. తనను తాను రక్షించుకునేందుకు, నిజం నిరూపించేందుకు అవినీతిపై దర్యాప్తు చేయించే అవకాశం ఇవ్వకుండా తన హక్కులను కాలరాశారని, జైలు శిక్ష విధించారని జమోరా వాదించారు. ప్రభుత్వ అనీతిపై పునర్విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ దశలో ఆ దేశ ఉన్నతన్యాయస్థానం బుధవారం జమోరాను విడుదల చేసింది. ఆయన దేశం నుండి పారిపోయే అవకాశం లేదని ఉన్నతన్యాయస్థానం ధృఢంగా విశ్వసించింది. 4,800 డాలర్లు ఆయన పూచీకత్తుగా చెల్లించాలని ఆదేశించింది. ఆయనను జైల్లో ఉంచటం న్యాయసమ్మతం కాదని కోర్టు స్పష్టం చేసింది. 67ఏళ్ల వయసుగల జమోరా గ్వాటెమాలాలో మూడు పత్రికలకు అధిపతి.ఉన్నతమైన నైతిక విలులుగల జర్నలిస్టుగా అవినీతిపై జీవితకాల పోరాటం చేస్తూ వస్తున్నారు. 2023 జులై 29న ఆయన మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేశారు. అంతకుముందు 2003లో కూడా ఆయన కిడ్నాప్‌లను, నిర్బంధాలను ఎదుర్కొన్నారు. 2008లో వేధింపులతో జరిగిన దాడులలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. జైలునుంచి విడుదలయ్యాక ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జీవితకాలంలో తాను ఎన్నో దాడులు ఎదుర్కొన్నానని నిరంతర పోరాటం చేస్తున్నాననీ, జర్నలిజం చేయడమే నేరంగా మారిందనీ ఆయన చెప్పారు. రాజకీయ దురుద్దేశంతోనే జమోరాను కేసులలో ఇరికించి జైల్లో పెట్టారని పత్రికా స్వేచ్ఛకోసం పోరాడే బృందాలు, మానవహక్కుల బృందాలు పేర్కొన్నాయి.

## ప్రాణాల కోసం పరుగులు

### రఫాను ఖాళీ చేసిన ఆరు లక్షలమంది



**రఫా :** ఐక్యరాజ్యసమితి సహా యావత్ ప్రపంచం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఇజ్రాయిల్ తన దాడులు ఆపలేదు సరికదా రఫా ప్రాంతంలో మరింత ఉధృతం చేసింది. దీంతో గడచిన పది రోజులుగా రఫా నుండి 6,00,000 లమంది పాలస్తీనియన్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. రోడ్డుమీద నిలబడినా కాల్పులు, దాడులు జరుగుతూ ఉండటంతో ప్రాణాలు దక్కించుకునేందుకు పాలస్తీనియన్లు లగేజీలన్నీ వదిలేసి చేతిలో చిన్న సంచీలతో పారిపపోతున్నారు. కొన్ని కుటుంబాలు ఉమ్మడిగా వాహనాలు పెట్టుకుని వెళ్ళిపోతున్నాయి. గాజాపై గత ఏడాది అక్టోబరు 31న ఇజ్రాయిల్ సైన్యం దాడి చేశాక 15 లక్షల మంది రఫాకు వెళ్ళి తలదాచుకకున్నారు. ఇప్పుడు వారికి అక్కడ కూడా రక్షణ లేకపోవడంతో అక్కడి నుండి కూడా పారిపోతున్నారు.గాజాలో ఒక ఇంటర్నెట్ సెంటర్ వద్ద గుమిగూడిన ప్రజలపై ఇజ్రాయిల్ సైన్యం దాడిచేయటంతో నలుగురు పాలస్తీనియన్‌లు మరణించారు. మరోవైపు ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో జరిగిన



దాడులలో ముగ్గురు మరణించారు. తుల్కారం ప్రాంతంలో సైన్యం కాల్పులు జరపటంతో ముగ్గురు పాలస్తీనియన్‌లు మరణించగా ప్రజలు ఆగ్రహంతో సమ్మె పిలుపు ఇచ్చారు.

**గాజా భవితవ్యంపై వార్ క్యాబినెట్‌లో విభేదాలు**

మరోవైపు ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహు వార్ క్యాబినెట్‌లో విబేధాలు తలెత్తాయి. యుద్ధానంతరం గాజాలో అనుసరించే వైఖరి ఏమిటి? అనే విషయంపై వార్ క్యాబినెట్‌లో రక్షణమంత్రి చర్చ లేవదీశారు. యుద్ధానంతరం అనుసరించాల్సిన ఒక ప్రణాళిక ఏది? ఇజ్రాయిల్ వద్ద లేకపోవటాన్ని ఆయన ప్రశ్నించటంతో చర్చ జరిగింది. కానీ నేతన్యాహు అందుకు తగిన సమాధానం చెప్పలేదు. యుద్ధానంతర వైఖరి లేకపోతే ప్రమాదకరపరిస్థితులు వస్తాయని రక్షణమంత్రి హెచ్చరించారు. ఇదే విషయంపై అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ మాట్లాడుతూ గాజాలో యుద్ధానంతరం అనుసరించాల్సిన ఒక బృహత్తర ప్రణాళికను ముందుగా సిద్ధం చేసుకోకపోతే సాయుధ ముఠాలు దీన్ని అవకాశంగా తీసుకుని రెచ్చిపోతాయని నేరాలు విజృంభిస్తాయని హెచ్చరించారు.

## ఐసిజె విచారణ ప్రారంభం



**హేగ్ :** ఇజ్రాయిల్ సామూహిక ఊచకోత, హింసాకాండకు వ్యతిరేకంగా దాఖలైన కేసులపై ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ గురు, శుక్రవారాల్లో విచారణ జరుపుతోంది. ఈ ఐసిజె ప్యానల్‌లో 15 మంది న్యాయమూర్తులు ఉన్నారు. గాజాలో ఊచకోత వెంటనే ఆపాలని పాలస్తీనా ప్రజలకు మానవతా సహాయాన్ని పెంచాలని ఐసిజె గడచిన జనవరిలోనే ఆదేశించినప్పటికీ ఇజ్రాయిల్ పట్టించుకోలేదు. రఫాలో ఇజ్రాయిల్ పది రోజులుగా కొనసాగిస్తున్న దమనకాండపై దక్షిణ ఆఫ్రికా ఐసిజెలో ఫిర్యాదు చేయడంతో మళ్ళీ విచారణ ప్రారంభమైంది. మొదటినుండీ ఇజ్రాయిల్ దాష్టీకాలను దక్షిణాఫ్రికా అంతర్జాతీయ వేదికలపై నిలదీస్తూ ఒక హీరోగా పేరు సంపాదించుకుంది. తాజాగా ఈ యుద్ధాన్ని నిలిపివేయాలని, ఎమర్జెనీ చర్యలు తీసుకోవాలని ఐసిజెకు ఫిర్యాదు చేసింది. రఫాలో యుద్ధం ఆపాలని దక్షిణాఫ్రికా డిమాండ్ చేస్తున్నది.

**ఇజ్రాయిల్ సైనికుల మధ్య ఎదురు కాల్పులు : ఐదుగురు మృతి**

ఇజ్రాయిల్ సైనికులు జబాలియా క్యాంప్ వద్ద బుధవారం రాత్రి పరస్పరం కాల్పులు జరుపుకున్నారు. ఈ కాల్పుల్లో ఐదుగురు ఇజ్రాయిల్ సైనికులు మరణంచారు. ఈ కాల్పుల ఘటనకు ఇజ్రాయిల్ ఫ్రెండ్లీ ట్యాంక్ ఫైరింగ్ అని పేరు పెట్టింది. మరో ఏడుగురు సైనికులు గాయపడ్డారు. ఐడిఎఫ్ (ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్) ఈ విషయం ప్రకటించింది. ఒకే భవంతిపై ఇజ్రాయిల్ సైనికులు ట్యాంకులను గురిపెట్టి కాల్పులు జరపడంతో ఎదురుదెరుగా ఉన్న సైనికులు మరణించారు. దీంతో ఇప్పటివరకూ ఈ యుద్ధంలో మరణించిన ఇజ్రాయిల్ సైనికుల సంఖ్య 278కి పెరిగింది.

## ప్రపంచవ్యాప్తంగా 14.55 కోట్లమంది నిరాశ్రయం

**గాజా :** ప్రపంచవ్యాప్తంగా 2023 వ సంవత్సరం నుండి ఇప్పటివరకూ ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాల కారణంగా 14.55 కోట్లమంది నిరాశ్రయులయ్యారు. వారంతా ఇళ్ళు కోల్పోయి, ఇళ్ళు వదిలి అనాథల్లా ఇతర ప్రాంతాల్లో తలదాచుకుని బతుకుతున్నారు. వీటిలో సూడాన్, డి.ఆర్.కాంగో, పాలస్తినాలలో జరుగుతున్న యుద్ధాల కారణంగా ప్రజలు ఆవాసాలు కోల్పోయి ఈ వలసలలో సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది ప్రకృతి వైపరీత్యాలవల్ల వివిధ దేశాల్లో అంతర్గతంగా 7.78 కోట్లమంది నిరాశ్రయులయ్యారు. యుద్ధాల కారణంగా 6.83 కోట్ల మంది నిరాశ్రయులయ్యారు. పలు దేశాలలో ప్రకృతి వైపరీత్యాలవల్ల 7.59 కోట్లమంది స్వస్థలాలు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్ళి కొత్తగా జీవితాలు ప్రారంభించారని ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్ మోనిటరింగ్ సెంటర్ (ఐడిఎంసి) ఎన్‌జిఓ నివేదికలు వెల్లడించాయి. 2014 నుండి ఇప్పటివరకూ పదేళ్ళలో ఈ గణాంకాలు రోజు రోజుకూ ఉద్ధృతం అవుతున్నాయి, వైపరీత్యాలు పెరుగుతున్నాయి, ప్రాంతీయస్థాయిల్లో యుద్ధాలు కొత్త కొత్త ప్రాంతాలలో చెలరేగుతున్నాయని ఐడిఎంసి డైరెక్టర్ అలెగ్జాండర్ బిలాక్ చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలవల్ల నిరాశ్రయులైనవారు 2022 కంటే భారీగా పెరిగారని చెప్పారు. సూడాన్‌లో అంతర్యుద్ధం కారణంగా 60 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వారు ఇతర ప్రాంతాలకు పారిపోయారు. డి.ఆర్.కాంగోలో కరువు యుద్ధ పరిస్థితులవల్ల 30.70 లక్షలమంది ఇళ్ళు వదిలేసి ఇతర ప్రాంతాలకు పారిపోయారు. పాలస్తినాలో యుద్ధం వల్ల 30.40 లక్షలమంది దేశం వదిలిపారిపోయారు. గాజాలో యుద్ధం కారణంగా 3.80 లక్షల ఇళ్ళు నేలమట్టం అయ్యాయి. 20 లక్షలమంది ప్రాణాలు దక్కించుకునేందుకు రఫా ప్రాంతానికి పారిపోయారు. అనేకవేలమంది ఈ పోరాటంలో ప్రాణాలు కోల్పోయారు.

## చైనా–రష్యా మధ్య ఉన్నది అవకాశవాద సంబంధం కాదు

### 'మై డియర్ పుతిన్...' అప్యాయంగా పిలిచిన జిన్‌పింగ్

### రెండు రోజులు చైనాలో పుతిన్ పర్యటన



**బీజింగ్:** ప్రపంచంకోసమే చైనా–రష్యా అగ్ర రాజ్యాల మధ్య సంబంధాల స్థిరీకరణ జరుగుతుందని రెండు దేశాల నాయకులు ఉద్ఘాటించారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ గురు, శుక్రవారాల్లో చైనా పర్యటనలో భాగంగా మొదటిరోజు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ తన ప్రసంగం ప్రారంభంలో ''మై డియర్ పుతిన్....'' అని సంబోధించారు. రష్యా,చైనా మధ్య సంబంధాలకు ఎంతో మౌలికమైన ప్రాధాన్యం ఉందని ఆయన అన్నారు. ఈ రెండు దేశాలమధ్య సంబంధాలు ఒక అవకాశవాదం కాదనీ, ఎవ్వరిమీదా గురిపెట్టి కొనసాగుతున్న సంబంధాలు కాదని జిన్‌పింగ్ అన్నారు. ''మనమధ్య సహకారం ఈనాటి ప్రపంచ పరిస్థితుల్లో అంతర్జాతీయ యవనికపై ఒక స్థిరీకరణ శక్తిగా దోహదం చేస్తుంది'' అని జిన్‌పింగ్ అన్నారు. ''మేం ఉక్రేన్‌పై బహిరంగ చర్చకు సిద్ధం, కానీ ఈ విధమైన సంప్రదింపులను మాతో సహా ఈ సమస్యతో సంబంధం ఉన్న అన్ని దేశాల ప్రయోజనాల కోసమే అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి'' అని పుతిన్‌ను ఉటంకిస్తూ జిన్హువా వార్తా సంస్థ పేర్కొంది. ప్రపంచం కల్లోలంగా ఉన్న పరిస్థితుల్లో ఈ అగ్రరాజ్యాధినేతలమధ్య సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచశాంతిని స్థిరీకరించడానికి ఈ రెండు దేశాల మధ్య సంబంధాలే ఒక అతిపెద్ద ఉదాహరణ అని నాయకకులు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధంలో రష్యాకు మద్దతు ఇవ్వొద్దని జిన్‌పింగ్‌పై అమెరికా, యూరోపియన్ యూనియన్‌ల నుండి ఒత్తిడి వస్తున్న తరుణంలో ఈ సమావేశం జరిగింది. అదేవిధంగా రష్యా,చైనా మధ్య దౌత్య సంబంధాలకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కూడా చైనాలో పుతిన్ పర్యటనకు ఒక ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా గ్రేటర్ హాల్ వద్ద పుతిన్‌కు ఘన స్వాగతం లభించింది. పుతిన్ దేశాధ్యక్షుడుగా ఇటీవల మరోసారి బాధ్యతలు చేపట్టాక తొలి విదేశీ పర్యటన ఇదే. అదేవిధంగా చైనాలో గడచిన ఆరునెలల్లో రెండోసారి ఆయన పర్యటిస్తున్నారు. తాము ఇద్దరం 45 నిమిషాలసేపు సన్నిహితంగా మాట్లాడుకున్నామని జిన్‌పింగ్ చెప్పారు. రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక వ్యాపార సంబంధాల వృద్ధిపై వారి చర్చలు ప్రధానంగా జరిగాయి. గాజా, ఉక్రేన్ సహా ప్రపంచ పరిణామాలపై కూడా వారు చర్చించారు.

## స్లోవాకియా ప్రధాని ఫికోపై వృద్ధ పెన్షనర్ కాల్పులు

### మృత్యువుతో పోరాడుతున్న దేశనేత





**బ్రాటిస్లావా:** యూరప్‌దేశమైన స్లోవాకియా ప్రధానమంత్రి రోబర్ట్ ఫికో కాల్పుల్లో తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాటం చేస్తున్నారు. ఆయన పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదని, అత్యంత ప్రమాదకంగా ఉందని ఆ దేశ రక్షణమంత్రి రోబెర్ట్ కలినాక్, ఆసుపత్రి డైరెక్టర్ మిరయం లపినికోవా గురువారం ప్రకటించారు. ఫికో (59) బుధవారం మధ్యాహ్నం హండ్లోవా నగరంలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని కల్చరల్ సెంటర్ భవనం వెలుపల గుమిగూడిన ప్రజలకు అభివాదం చేస్తుండగా ఒక దుండగుడు ఆకస్మికంగా తుపాకితో ఆయనపై ఐదుసార్లు కాల్పులు జరిపాడు. ఆయన తలలోంచి, పొట్టలోంచి, ఛాతీలోంచి తూటాలు దూసుకుపోయాయి. దాతతో ఆయనను బాన్‌స్కా బైసికాలోని ఎఫ్.డి.రూజ్‌వెల్ట్ యూనివర్సిటీ ఆసుపత్రికి హెలికాప్టర్‌లలో తరలలించారు. ఐతే ఈ కాల్పులు జరిపింది 71 సంవత్సరాలు వయసుగల ఒక వృద్ధుడు కావడం విశేషం. అతడిని లెవిస్ పట్టణవాసిగా గుర్తించామనీ, అతగాడు గతంలో జరిగిన అనేక నిరసన ప్రదర్శనల్లో పాల్గొనడాన్ని పోలీసులు గుర్తించారనీ స్లోవేకియా హోంశాఖా మంత్రి మాతస్ సుతజ్ ఎస్టోక్ చెప్పారు. కాగా ఈ వృద్ధుడు ఒక పెన్షనర్. తన లైసెన్స్‌డ్ తుపాకీతోనే ప్రధానమంత్రిపై కాల్పులు జరిపాడు. కాల్పులు జరపడానికి ముందుగా ప్రధామంత్రి దృష్టిని తనమీదకు మళ్ళించేందుకు ఈ వృద్ధుడు ''కమ్ హియర్ రోబో...'' అంటూ గట్టిగా అరుపులు అరిచాడు. ఆతర్వాత కాల్పులు జరిపాడు. దానికిగల కారణాలపై పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వృద్ధుణ్ణి పోలీసులు అరెస్టు చేశారు. యూరప్‌లోని అనేక దేశాల నాయకులు ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించాయి. మరో మూడు వారాలలో యూరోపియన్ యూనియన్ పార్లమెంటు ఎన్నికలు జరుగనున్నాయి. ఫికో పార్టీ కూడా భాగస్వామ్యంగా ఉన్న కూటమికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఊహాగానాలు జరుగుతున్న తరుణంలో ఆయనపై ఈ కాల్పుల దాడి జరిగింది. ఫికో తన పొరుగు దేశమైన ఉక్రేన్ పాలనావిధానాలకు తీవ్రవ్యతిరేకి. ఆయన రష్యా అనుకూలుడు. రష్యాతో రాజీ పడాలని ఉక్రేన్ అధ్యక్షుడు జలెన్‌స్కీపై ఒత్తిడి చేస్తున్నారు. ఫికో ప్రధానమంత్రిగా గెలిచిన తరువాత ఉక్రేన్‌కు ఆయుధ సరఫరా నిలిపివేశారు. గడచిన అక్టోబర్‌లో ఆయన ప్రధానమంత్రి బాధ్యత స్వీకరించారు. ఇప్పుడు నాలుగోసారి ఆయన ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాజకీయాలలో అపార అనుభవం సంపాదించిన ఫికో ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధం విషయంలో క్రెమ్లిన్, రష్యా సాంస్కృతిక మూలాలు, వారసత్వ విధానాల ప్రాతిపదికపైనే వ్లాదిమిర్ పుతిన్‌ను సమర్థిస్తున్నారు.

## ఐదుగురు ప్రధానులు (మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. మీరేమైనా చేసుకోండి కాని సిఎఎను తొలగించలేరని చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆజాంఘడ్‌లో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగించారు. సిఎఎ కింద హిందూ, సిక్కు, జైన్, బౌద్ధ శరణార్థులకు పౌరసత్వ సర్టిఫికెట్ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వీరు అనేక సంవత్సరాలుగా దేశంలో శరణార్థులుగా జీవిస్తున్నారని, మత ఆధారంగా జరిగిన విభజనలో వీరంతా బాధితులని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శరణార్థులను నిర్లక్ష్యం చేసిందని, సిఎఎ పేరుతో కాంగ్రెస్, ఎస్‌పిలు అబద్ధాలు వ్యాపింపజూస్తూ, ఉత్తరప్రదేశ్, మొత్తం దేశాన్ని అల్లర్ల దిశగా నెట్టేందుకు ప్రయత్నించాయని మోదీ ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం లేనప్పటికీ సిఎఎను తీసివేస్తామంటున్నారని, ఆ పని ఎవ్వరూ చేయలేరని చెప్పారు. మీరు మోసగాళ్ళు.. ఈ దేశాన్ని మతం మంటల్లో దహించేలా చేసారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## రాబడి సాధించాలి (మొదటి పేజీ తరువాయి)

చోట్ల భూముల మార్కెట్ విలువకు, వాస్తవ క్రయ విక్రయాల రేట్లకు పొంతన లేకపోవటం ప్రధాన కారణమనే చర్చ జరిగింది. ''గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుంది. ఈ ధరల సవరణకు చర్యలు చేపట్టాలి'' ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎక్కడెక్కడ, ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి, వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని, రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగం నిబంధనలను పక్కాగా పాటించాలని సిఎం చెప్పారు. రాష్ట్ర రాబడి పెంపుతో పాటు స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్టాంప్ డ్యూటీ ఎంత మేరకు ఉంది.. తగ్గించాలా.. పెంచాలా.. అనేది కూడా అధ్యయనం చేయాలని అధికారులకు సిఎం సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే చాలాచోట్ల అద్దె భవనాల్లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు ఇప్పటికే చెట్ల కింద నిలబడే ఉంటున్నారని చర్చకు వచ్చిందని, పబ్లిక్ యుటిలిటీకి సేకరించిన స్థలాలను గుర్తించి కొన్నిచోట్ల అధునాతనంగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మించాలని, అందుకు సన్నాహాలు చేయాలని సిఎం చెప్పారు. సామాన్యులకు, చిన్న చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇసుక ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను ఎక్కడికక్కడ అరికట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## సమాయత్తమవ్వండి (మొదటి పేజీ తరువాయి)

పొలాల మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు వచ్చే నెలాఖరులోగా అందజేసేవిధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరికొయ్యలు తగలపెడితే జరిమానాలు విధించాల్సిలన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్ళను వేగవంతం చేసి ఎట్టి పరిస్థితుల్లో మే నెల చివరినాటికి పూర్తి చేయాలన్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కేటాయించిన భూములలో ఆధునిక సాంకేతికతతో పండ్లతోటల పెంపు, నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని తెలిపారు. ఆయిల్‌పామ్ కంపెనీల పనితీరు ఆధారంగా చర్యలు తీసుకోవాలని, మల్బరిసాగుకు అనుకూల ప్రాంతాలను ఎంపిక చేసి పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాలలో మ్యాచింగ్ గ్రాంటు బకాయి నిధుల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అంతేకాకుండా అన్ని రకాల సహకారసంఘాలలో సభ్యుల గుర్తింపు, పదవీకాలం ముగిసిన సంఘాల ఎన్నికల నిర్వహణకు సత్వరమే చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధికారులను ఆదేశించారు.

## సింగల్ స్క్రీన్ సినిమా థియేటర్లకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినిమా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, సింగల్ స్క్రీన్ సినిమా థియేటర్లకు రాయితీలు ప్రకటించాలని, చిన్న తరహా సినిమా థియేటర్లలో పనిచేస్తున్న సిబ్బందిని ఆదుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సినిమా థియేటర్లలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నారన్నారు. చిన్న తరహా థియేటర్లను బతికించి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదన్నారు. సినిమా రంగంలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ సమస్యలో భాగస్వాములై సమస్య పరిష్కారంలో తమ వంతు పాత్రను పోషించాలని వారు కోరారు. వాస్తవానికి ఓటిటి, కార్పొరేట్ మల్టీ ఫ్లెక్స్‌లు వచ్చిన తరువాత చిన్న తరహా థియేటర్లు మోసివేతకు వచ్చాయని వారు అన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని థియేటర్లలో తక్కువ ధర టికెట్లు తీసుకుని సినిమాలను ప్రేక్షకులు వీక్షిస్తున్నారని, అయితే మల్టీఫ్లెక్స్ లు రావడం మూలంగా టికెట్ల రేట్లు అమాంతం పెరిగిపోయిందని అన్నారు. ఫలితంగా సామాన్య సినిమా ప్రేక్షకులకు వినోదం దూరమయ్యే ప్రమాదమున్నదన్నారు.

## జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టీప్లెక్స్ భవనం లీజ్ రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజామాబాద్ జిల్లా ఆర్మూరు బస్ స్టేషన్ సమీపంలోని ఆర్‌టిసి స్థలంలో ఉన్న జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టీప్లెక్స్ భవనాన్ని గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌టిసి యాజమన్యం ప్రకటించింది. బకాయిలను చెల్లించకపోవడంతో హైకోర్టు ఉత్తర్వుల మేరకు వి ష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో చేసుకున్న అద్దె ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించింది. ఆర్‌టిసి సంస్థకు చెంది న 7059 చదరపు గజాల స్థలంలో 33 ఏళ్ల పాటు విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలపర్స్ కంపెనీ బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్ఫర్(బీవోటీ) కింద 01. 06.2013న లీజుకు తీసుకుందని, ఇదే క్రమంలో 2017లో విష్ణుజిత్ ఇన్ఫ్రా డెవలప ర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని మాజీ ఎమ్మె ల్యే జీవన్ రెడ్డి సతీమణి రజితా రెడ్డి టేక్‌ఓవర్ చేసుకుని, షాపింగ్ మాల్‌కు జీవన్ రెడ్డి మా ల్ అండ్ మల్టీపెక్స్ గా పేరుమార్చడంతో పాటు థర్డ్ పార్టీలకు అందులోని స్టాళ్లను లీజు కు ఇచ్చారని అధికారులు తెలిపారు. అయితే ఒప్పందం ప్రకారం ఆ కంపెనీ ఆర్‌టిసికి సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో గత ఏడాది అక్టోబర్ వరకు రూ.8.65 కోట్ల బకాయిలను పేరుకుపోవడంతో వెంటనే చెల్లించాల్సిందిగా సంస్థ నోటీసులు జారీ చేయగా, రూ.1.50 కోట్లను చెల్లించారన్నారు. మిగిత బకాయిలు సైతం చెల్లించాలని సదరు సంస్థకు షోకాజ్ నోటీసులు పంపించడంతో గత ఏడాది డిసెంబర్ లో విడతల వారీగా రూ.2.40 కోట్లను చెల్లించడంతో పాటు షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. దీంతో ఆర్‌టిసికి బకాయిలు చెల్లించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో విడతల వారీగా మరో రూ.2 కోట్లను చెల్లించారని వెల్లడించారు. మిగిత బకాయిలన్నీ నెల రోజుల్లో చెల్లించాలని మార్చి 27న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడమే కాకుండా అది ప్రజల డబ్బు అని స్పష్టం చేసిందన్నారు. నెల రోజుల్లో బకాయిలు చెల్లించకుంటే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాల మేరకు గడువు పూరైనా బకాయి పద్ద రూ.2.51 కోట్ల అద్దెను చెల్లించలేకపోవడంతో భవనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌టిసి యాజమన్యం ఓ ప్రకటనలో తెలిపింది.

## భాగ్యనగరం తడిసిముద్ద (మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. గురువారం మధ్యాహ్నం వరకు ఉక్కపోతతకు ఉక్కిరిబిక్కిరి అయిన హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉదయం కొన్ని గంటల పాటు భానుడి తాపంతో భగభగమంటూ మండిపోయి నగరం, మధ్యాహ్నం తరువాత చల్లబడింది. మేఘాలు కమ్మేసి, నగరాన్ని చల్లార్చాయి. చిరుజల్లులతో కూడిన వర్షం కురవడం ప్రారంభమయ్యింది. ఇక చూస్తుండగానే, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఏకధాటిగా గంటకు పైగా కుండపోత వర్షం కురవడంతో నగర వ్యాప్తంగా రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్లు నదులను తలపించాయి. చాలా ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కూకట్‌పల్లిలో మొదలై క్రమక్రమంగా సికింద్రాబాద్, అల్వాల్, బేగంపేట్, ఎల్.బి.నగర్ వరకు విస్తరించింది. నిజాంపేట్, హైదర్ నగర్, బాచుపల్లి, సికింద్రాబాద్, బోయిన్ పల్లి, మారేడుపల్లి, బేగంపేట్, ప్యారడైజ్, చిలకలగూడ, అల్వాల్, జీడిమెట్ల, సూరారం, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు విస్తరించింది. అటు హిమాయత్ నగర్, సచివాలయం, దిల్‌సుఖ్ నగర్, ఎల్.బి.నగర్, ఉప్పల్ ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. నగర వాప్తంగా వర్షం కురిసింది. ఖైరతాబాద్‌లోని చింతల్ బస్తీలో 17 చోట్ల వరద నీరు నిలిచిపోయింది. రంగంలోకి దిగిన డిఆర్‌ఎఫ్ సిబ్బంది మ్యాన్ హోల్స్ తెరిచి వరద నీటిని మళ్లించారు. విద్యుత్ శాఖ అధికారులు ముందు జాగ్రత్తగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. జిహెచ్‌ఎంసి సిబ్బంది వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టింది. సహాయక చర్యల కోసం వర్షం పడిన గంటసేపట్లోనే 70కి పైగా ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

**నాలాపై కూలిపోయిన స్లబ్**

బంజారాహిల్స్ రోడ్ నెంబర్9లో నాలా స్లబ్ కూలిపోయింది. నాలాపై రోడ్డు కుంగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లో నాలా పైకప్పు కూలింది. నాలా కూలడంతో వరద నీటిలో ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. బల్కంపేటలో రైల్వే అండర్‌పాస్ కింద వరద నీటిలో కారు మునిగిపోయింది. మలక్‌పేట రైల్వే బ్రిడ్జి కింద భారీగా వరద నీరు నిలిచిపోయింది. రైల్వే అండర్‌పాస్ కిందకు నీరు చేరడంతో దిల్‌సుఖ్ నగర్ కోఠి మార్గంలో ఇరువైపుల రాకపోకలు నిలిచిపోయాయి. కోఠి, చాదర్‌ఘాట్, మలక్‌పేట, ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లోని స్టీల్ బ్రిడ్జిపై వరద నీరు నిలిచిపోయింది. స్టీల్ బ్రిడ్జి భారీ ఎత్తున నీరు ప్రవహించడంతో నది ప్రవహాన్ని తలపించింది. పంజాగుట్ట, బేగంపేట వద్ద రహదారిపై భారీగా వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. వరద నీటిని తొలగించేందుకు డిఆర్‌ఎఫ్ బృందాలు చర్యలు చేపట్టాయి.

**ఎక్కడికక్కడ స్తంభించి ట్రాఫిక్**

భారీ వర్షంతో రహదారులపైకి వరద పోటేత్తడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. సాయంత్రం 5 గంటలకు వర్షం తెరిపి ఇవ్వడంతో పాటు కార్యాలయాలు ముగించుకుని ఇళ్లకు బయలుదేరడంతో వాహనాలన్ని ఒక్కొక్కటిగా రహదారులపైకి వచ్చాయి. దీంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ వాహనాల రద్దీతో నిండిపోయాయి. పలు ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు చేరడంతో రహదారులపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గచ్చిబౌలి, బయో డైవర్సిటీ, ఐకియా, విప్రో జంక్షన్, జూబ్లీ హిల్స్ చెక్‌పోస్టు, రోడ్డు నంబర్ 45, బేగంపేట, పంజాగుట్ట సహా పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. మాదాపూర్ నుంచి కెపిహెచ్‌బి వైపు వెళ్లే మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. మాదాపూర్ నెక్టార్ గార్డెన్, శిల్పారామం సైబర్ గేట్ వే రోడ్లపై వరద నీరు నిలిచిపోయింది. జిహెచ్‌ఎంసి అత్యవసర బృందాలు రంగంలోకి సహాయక చర్యలు చేపట్టాయి.

**సికింద్రాబాద్‌లో రికార్డులో స్థాయిలో నమోదైన వర్షపాతం**

సికింద్రాబాద్‌లో అత్యధికంగా 9.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక మలక్ పేటలో 8.4, బంజారాహిల్స్ వేంకటేశ్వర కాలనీలో 8.3, బేగం బజార్‌లో 8.1, గోల్కొండలో 7.5, కృష్ణా నగర్‌లో 7.45, అస్మాన్ ఘడ్‌లో 7.3, బంజారాహిల్స్, గోల్కొండలో 7.2, యూసుఫ్‌గూడలో 51.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖైరతాబాద్‌లో 48.0, కుత్బుల్లాపూర్‌లో ఆదర్శ నగర్‌లో 44.3, ఖైరతాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో 42.8, బాలానగర్‌లో 42.5, షేక్‌పేటలో 42.3 వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.

**వర్ష బీభత్సంపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష : యంత్రాంగాన్ని అప్రమత్తం**

వర్ష బీభత్సంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వెంటనే అత్యవసర బృందాలను రంగంలోకి దింపి, సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలు, వర్ష ప్రభావంపై అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమాలోచనలు జరిపారు. వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.

**బంజారాహిల్స్ నాలాను పరిశీలించిన మేయర్**

భారీ వర్షాల నేపథ్యంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మేయర్ విజయలక్ష్మి నగరంలోని జోనల్ కమిషనర్లు, ఈవిడిఎం డైరెక్టర్‌తో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బంజారా హిల్స్‌లో నాలా కొట్టుకుపోయిన ప్రాంతాన్ని సందర్శించారు. నీరు నీలిచే ప్రాంతాలు, నాలాల వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని, వరద నీరు నీలిచే ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, నేలకొరిగిన వృక్షాలను తొలగించాలని ఆదేశించారు. రాత్రి 7 గంటల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. డిఆర్‌ఎఫ్ బృందాల చర్యల కోసం 040 21111111 లేదా 9000113667 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

## అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపచేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అన్ని రకాల వడ్లకు బోనస్ వర్తింపచేయాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సన్న బియ్యం పండించే రైతులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రు.500లు బోనస్ చెల్లించనున్నట్టు వార్తలు వస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, రైతుల్లో వున్న ఆందోళనను తొలగించడం కోసం ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటనను చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## బిఆర్‌ఎస్ నిరసనలు (మొదటి పేజీ తరువాయి)

తీవ్ర అన్యాయం చేస్తుందని, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడం లేదని మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి ఆరోపించారు. శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం వద్ద మేడ్చల్ నియోజకవర్గ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద చేపట్టిన ధర్నాలో రైతులు పండించిన వరి ధాన్యంపై క్వింటాల్ కు రూ.500ల బోనస్‌ను రైతులకు అందచేయాలని, పండించిన వరి ధాన్యంను వెంటనే కొనాలని డిమాండ చేశారు.

## 'టిజి' అమలు (మొదటి పేజీ తరువాయి)

మంత్రిత్వ శాఖ ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఇక నుండి తెలంగాణ రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు టిఎస్ స్థానంలో రాష్ట్ర కోడ్‌ను టిజి పేరుతో ఉండే విధంగా రిజిస్ట్రేషన్లు చేయాలని పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రకారం, సీరియల్ నంబర్ 29ఎ, టిఎస్ కింద రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కోసం వాహనాలపై రిజిస్ట్రేషన్ గుర్తు టిజిగా సవరించి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాలలో కొనసాగిన ఆవర్తనం ఈ రోజు మధ్యప్రదేశ్‌లోని నైరుతి ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పారు. గురువారం రాష్ట్రంలో కింది స్థాయి గాలులు ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నట్లు తెలిపారు. కొద్ది రోజులుగా రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం కనిపిస్తుంది. ఉదయం తీవ్రమైన ఎండలు సాయంత్రం అయ్యే సరికి భారీ మేఘాలు కమ్మి ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు పడుతున్నాయి.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## 'మోదీ పూజ'కు పరాకాష్ట



వ్యక్తిపూజ పెరిగితే ప్రజాస్వామ్య పునాదులు కదిలిపోతాయని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన హెచ్చరికను గుర్తు చేసుకోవాల్సిన తరుణం ఇది. బిజెపి అగ్రనేతలు ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీని ఇంద్రుడు.. చంద్రుడు అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఆయన దార్శనికత భారత్‌కు ఎంతో అవసరమని, దేశం సుభిక్షంగా ఉండాలన్నా, అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలన్నా మోదీ మరోసారి ప్రధాని కావాల్సిందేనని ఊదరగొడుతున్నారు.
ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రశంసకుల జాబితాలో ఇప్పుడు ముందుకున్నారు.జేలమ్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి, కేంద్ర మంత్రి భాను ప్రతాద్ వర్మకు మద్దతుగా బుధవారం జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మోదీని శ్రీకృష్ణుడి తో పోల్చారు. లోక్‌సభ ఎన్నికల మహాభారత యుద్ధంలో దుర్యోధన, దుశ్శాసను ల వంటి ప్రతిపక్ష పార్టీలను ఎదుర్కోవడానికి మోదీ శ్రీకృష్ణుడి పాత్ర పోషిస్తున్నారని అందలం ఎక్కించారు. సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి), బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి), కాంగ్రెస్ కలిసి ముందేల్‌ఖండ్ ప్రాంతాన్ని మాఫియాకు అప్పగించాయని ఆదిత్యనాథ్ ఆరోపించారు. ఈ పార్టీల నుంచి దేశంలోని 140 కోట్ల మంది ప్రజలను రక్షించే మహా వ్యక్తిగా మోదీని కీర్తించారు.
ఇప్పటి వరకూ ప్రధానిని మహానేతగా పేర్కొంటున్న బిజెపి నాయకులు ఇప్పుడు ఆయనను ఏకంగా రాముడు, కృష్ణుడు అని పేర్కోవడం వ్యక్తి పూజకు పరాకాష్ట. ఇలాంటి నేతలు ఉన్నప్పుడు, మోదీలో నిరంకుశత్వ మరింత పెరగడంలో ఆశ్చర్యం ఏముంది?

## 'అయోధ్య'లో దడపుట్టిస్తున్న అరవింద్ సేన్

### ఫైజాబాద్ నియోజకవర్గంలో బిజెపి, ఎస్‌పిలకు సిపిఐ సవాల్



ఫైజాబాద్ లోక్‌సభ నియోకవర్గానికి ఒక ప్రత్యేకత ఉన్నది. దేశవ్యాప్తంగా బిజెపి ఉత్థానానికి కారణమైన రామమందిరం నెలవైన అయోధ్య పట్టణం ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉంది. అందుకే ఈ నియోజకవర్గం ఫలితం ఎట్లా ఉంటుందని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఫైజాబాద్ నియోజకవర్గం నుండి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రిటైర్డ్ ఐపిఎస్ అధికారి అరవింద్ సేన్ ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇస్తున్నారు. వ్యక్తిగత చరిత్ర, కుటుంబ నేపథ్యం ఆయనకు కలిసొస్తుంది. ప్రచారంలో ప్రతీచోట ఆయనకు మంచి ఆదరణ లభించడమే కాకుండా, తాము ఓట్లేస్తామని ప్రజలు చెబుతున్నారు. ఫైజాబాద్ జిల్లాలో సిపిఐ చరిత్ర ఘనమైనది, అయోధ్య రామమందిర ఉద్యమం ఉవ్వెత్తున లేచిన సమయంలోనే ఆ స్థానం నుండి సిపిఐ తరుపున మిత్రసేన్ యాదవ్ 1989లో ఎంపిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ తరుపున పోటీ చేస్తున్నది కూడా ఆయన కుమారుడు అరవింద్ సేన్. మిత్రసేన్ యాదవ్ ఆ తరువాత పార్టీ మారినప్పటికీ ఒకసారి ఎస్‌పి, మరొకసారి బిఎస్‌పి తరుపున ఫైజాబాద్ స్థానం నుండి గెలుపొందారు. ఆ తరువాత ఆయన చిన్న కుమారుడు ఆనంద్ సేన్ కూడా ఇదే నియోజకవర్గం నుండి గత ఎన్నికల్లో ఎస్‌పి తరుపున పోటీచేసి రెండవ స్థానంలో నిలిచారు.తన తండ్రి రాజకీయాలు ప్రారంభించిన సిపిఐ నుండే ఎంపిగా పోటీ చేస్తానని, ఐపిఎస్‌గా రిటైర్ అయిన తరువాత పట్టుబట్టి మరీ ఆయన ఫైజాబాద్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నారు. అరవింద్ సేన్ ప్రచారానికి మంచి ఆదరణ లభిస్తుండడంతో, ఆయనకు పడే ఓట్లు ఎవరికి నష్టం కలిగిస్తాయోనని బిజెపి, ఎస్‌పిలు భయపడుతున్నాయి. జిల్లాలో పేద ప్రజల కోసం పోరాడిన చరిత్ర సిపిఐకి, తన తండ్రికి ఉన్నదని, ఆ పోరాట వారసత్వాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ ప్రచారం చేస్తున్నట్లు అరవింద్ సేన్ వెల్లడించారు. ధనిక, పేదల మధ్య పెరుగుతున్న అంతరాలే తన ఎజెండా అని, ప్రస్తుత ఎన్నికల్లో ఎవరి గాలి లేదని, అది తనకు కలిసొస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# పంజాబ్ గ్రామాలలో బిజెపికి 'నో ఎంట్రీ'



పంజాబ్, హర్యానాలో బిజెపికి రైతు ఉద్యమం సెగ తగులుతోంది. ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న బిజెపి అభ్యర్థులకు గ్రామాలలో 'బిజెపికి ప్రవేశం లేదు' అనే ప్లకార్డులు, బ్యానర్‌లు ఎదురవుతున్నాయి. అలాగే వారికి నల్ల జెండాల స్వాగతం లభిస్తోంది. దీంతో ఎటూ పాలుపోని బిజెపి అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుంది. కనీస మద్దతు ధర కోసం 'చలో ఢిల్లీ'కి పిలుపునిచ్చిన రైతులను పంజాబ్‌లోని శంభూ బార్డర్ వరకే కేంద్ర ప్రభుత్వం పరిమితి చేసింది. అప్పటి నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిపై రైతులు రగిలి పోతున్నారు. అవకాశం కోసం ఓపిగ్గా వేచి ఉన్నారు. ప్రస్తుత లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో బిజెపిపై రైతులు, పంజాబ్ ప్రజలలో గూడు కట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. తొలిసారిగా పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలను ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగా బరిలో దిగిన బిజెపి ప్రచారానికి అడుగడుగున ఆటంకాలే ఎదురవుతున్నాయి. బిజెపి అభ్యర్థులు తమ గ్రామాలలోకి రావద్దని ఊరి శివార్లలోనే రైతులు, ప్రజలు వారిని అడ్డుకుంటున్నారు.
మాల్వా, మాజా ప్రాంతాలలో ప్రచారానికి వెళ్తున్న బిజెపి అభ్యర్థులకు నల్ల జెండాలతో స్వాగతం పలుకుతున్నారు.పంజాబ్‌లో బిజెపి అభ్యర్థులు హన్స్‌రాజ్ హన్స్(ఫరీద్‌కోట్), ప్రెణీత్ కౌర్ (పటియాలా), తేజీందర్ సింగ్ సంధు (అమృత్‌సర్), సుశీల్ కుమార్ రింకూ (జలంధర్), గుర్మీత్ సింఘ్ సోధీ (ఫిరోజ్‌పూర్), మాజీ ఎంఎల్‌ఏ దినేశ్ సింగ్ బబ్బు(గురుదాస్‌పూర్)లు రైతుల ఆగ్రహానికి గురయ్యారు. ఫరీద్‌కోట్‌లో బిజెపి జిల్లా అధ్యక్షుడు నిర్వహిస్తున్న ప్రచార సభను కీర్తి కిసాన్ సంఘ్ అడ్డుకోవడంతో, ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రాజీందర్ సింగ్ దీప్ సింగ్‌వాలాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇలా పలువురు రైతు నాయకులను అరెస్టు చేయడంతో సంయుక్త కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో పంజాబ్ వ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. గతవారంలో సోనిపత్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి మోహన్ లాల్ బదోలి ప్రచారసభను కోపంతో రైతులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది.
**జెజెపికి కూడా తప్పడం లేదు :** గత మార్చి నెల వరకు హర్యానాలో అధికార బిజెపితో అంటకాగిన జెజెపికి సైతం రైతుల నుండి తిప్పలు తప్పడం లేదు. రైతుల ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు జెజెపి నాయకుడు, నాటి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దుశ్యంత్ చౌతాలా బిజెపికే మద్దతినివ్వడం ఆ పార్టీని వెంటాడుతోంది. హిసార్‌లో జెజెపి అభ్యర్థి నైనా చౌతాలా ప్రచారానికి వెళ్ళినప్పుడు, ఆమె కాన్వాయ్‌పై రైతులు దాడి చేశారు. అలాగే బిజెపి అభ్యర్థులు అశోక్ తన్వర్ (సిర్సా నియోజకవర్గం), రంజిత్ చౌతాలా (హిసార్), అరవింద్ శర్మ (రోహ్‌తక్),మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ (కర్నాల్)ల ప్రచారం సందర్భంగా రైతులు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు.
బిజెపి రైతు వ్యతిరేక విధానాలపై పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరి లూధియానా నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న రవనీత్ సింగ్ బిట్టు తన ప్రచారంలో రైతుల నిరసనలకు ఆందోళన చెంది లైవ్ స్ట్రీమింగ్ ద్వారా తాను రైతుల ఉద్యమానికి మద్దతుగా ఢిల్లీ జంతర్ మంతర్‌లో సంఘీభావం ప్రకటించానని, వారితో కలిసి పడుకున్నానని చెప్పుకొచ్చారు. అయినా బిజెపిపై రైతుల ఆగ్రహం చల్లారలేదు. శిరోమణి అకాలీదళ్‌తో బంధం తెగిపోయాక గ్రామీణ పంజాబ్‌తో సంబంధాలు ఏర్పరచుకునేందుకు బిజెపి కిందా మీదా పడుతోంది. గ్రామీణ ప్రాంతాలలో అత్యధుకులు వ్యవసాయంపై ఆధారపడి ఉండడం, రైతు లను పణంగా పెట్టి పారిశ్రామిక వేత్తలకు కనీస మద్దతు ధర కోసం కొమ్ముకొస్తుందనే కోపం వారిలో ఉండడంతో ఆ పార్టీని ఆహ్వానించడం లేదు. అనేక మంది కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ నాయకులను చేర్చుకున్నా కూడా పంజాబీల హృదయాలను, ఎన్నికలలో ఓట్లను గెలచుకోవడం బిజెపికి కష్టసాధ్యంగా మారిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.
**ఇసికి బిజెపి, రైతుల పోటా పోటీ ఫిర్యాదులు :** రాష్ట్రవ్యాప్తంగా ఎదురవుతున్న నిరసనలతో బిజెపికి చిర్రెత్తిపోయింది. తమను గ్రామాలలో ప్రజలు ప్రచారం చేయనీయకుండా అడ్డుకుంటున్నారని పంజాబ్ రాష్ట్ర ఎన్నికల అధికారి (సిఇఒ) సి.సిబిన్‌కు బిజెపి పంజాబ్ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ జాఖఢ్ ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం తమకు ప్రచారం చేసుకునే అవకాశం లేకుండా చేస్తుందని ఆరోపించారు. దీనికి ప్రతిగా రైతుల ప్రతినిధి బల్బీర్ సింగ్ రాజేవాల్ కూడా సిఇఒను కలిసి తమపై రాజకీయ నాయకులు, భద్రతా సిబ్బంది దాడులు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రచారపర్వంలో తమను ప్రశ్నలు అడకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు.

## మతం కంటే కులమే ప్రధానం

రామమందిరం నెలవై ఉన్న అయోధ్య నగరం భాగంగా ఉండే ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో రామ మందిర రాజకీయాల ప్రభావం ఉంటుందనుకుంటున్నారా?అది తప్పు అని నియోజకవర్గ ఎన్నికల చరిత్ర నిరూపిస్తోంది. అక్కడ మతం కంటే కులం అంశమే ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తూ వస్తున్నాయి. ఇందుకు 2024లో జరుగుతున్న ఎన్నికలు కూడా భిన్నమేమి కాదు. అయోధ్య సిట్టింగ్ బిజెపి ఎంపి లల్లు సింగ్ అయోధ్య అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఐదుసార్లు ఎంఎల్‌ఏగా గెలిచారు. ఆయనపై సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అవదేశ్ ప్రసాద్‌ను పోటీలో నిలిపారు. అవదేశ్ తొమ్మిదిసార్లు ఎంఎల్‌ఏగా, గతంలో అఖిలేశ్ యాదవ్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేసిన సీనియర్ నేత. వృత్తి రీత్యా కాంట్రాక్టరైన లల్లు సింగ్ మూడవసారి విజయం కోసం తాపత్రయ పడుతున్నారు.
రామమందిర నిర్మాణం, ఫలితంగా జిల్లా అభివృద్ధితో బిజెపికి వచ్చి న పేరు తనను గట్టెక్కిస్తుందని ఆయన భావిస్తున్నారు. 2014లో సుమారు 2.8 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో లల్లు గెలుపొందగా, 2019లో మెజారిటీ భారీగా తగ్గిపోయి 65వేలకు పరిమితమైంది. ఈసారి ఆయన తీవ్రమైన ప్రజా వ్యతిరేకతతో పాటు, కాంగ్రెస్ మద్దతుతో రంగంలో ఉన్న బలమైన ఎస్‌పి అభ్యర్థిని ఎదుర్కొంటున్నారు. తమ రెండు పార్టీల ఓట్లతో అవదేశ్ ప్రసాద్ గెలుస్తారని కాంగ్రెస్, ఎస్‌పిలు భావిస్తున్నాయి. బిజెపి అభ్యర్థి లల్లు సింగ్ ఠాకూర్ కులానికి చెందిన వారు. ఆయనకు అగ్రవర్ణాల మద్దతు ఉన్నదని, దళిత వర్గానికి చెందిన ఎస్‌పి అభ్యర్థి అవదేశ్ కు దళితులలో ప్రాబల్యం ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.
సిపిఐ అభ్యర్థి అరవింద్ సేన్‌కు ఒబిసిలతో పాటు సిపిఐ ఓటు బ్యాంక్ కలిసొస్తుందని పత్రికలు చెబుతున్నాయి. బిఎస్‌పి తరుపున బ్రాహ్మణ వర్గానికి చెందిన సచ్చిదానంద పాండేను బరిలో నిలిపినప్పటికీ, పెద్దగా ఓటర్లను ఆకర్షించలేకపోతున్నారు. చతుర్ముఖ పోటీలో ఎవరైనా గెలవచ్చనే అంచనాలు కూడా వినవస్తున్నాయి.

## టిఎస్‌టెట్ హాల్ టికెట్స్ విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిఎస్ టెట్ 2024) హాల్ టికెట్ విడుదలయ్యాయి. అభ్యర్థులు తమ జర్నల్ నంబర్, పుట్టిన తేదీ, వివరాలు, ఎంటర్ చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మే 20 నుండి జూన్ 2 వరకు దయం 9గంటల నుండి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు రెండు సెషన్‌లో జరగనున్నాయి. టెట్ ఫలితాలు జూన్ 12న విడుదలయ్యే అవకాశం ఉన్నది.
**25 వరకు టిఎస్‌పిఇసెట్–2024 దరఖాస్తుల గడువు పెంపు**
టిఎస్ పిఇ సెట్ 2024 ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 25 వరకు పొడిగించారు. డిగ్రీ పూర్తయిన వారు, అలాగే ఫైనల్ సెమిస్టర్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన వారు బి.పిఇడి, డిపిఇడిలకు దరఖాస్తు చేసుకోవచ్చని టిఎస్ పిఇసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ తెలిపారు.
**20 నుండి 25 వరకు 'లా సెట్' తప్పుల సవరణ**
లాసెట్ దరఖాస్తుదారుల తప్పుల సవరణకు 'టిఎస్ లాసెట్, పిజిఎల్ సెట్ 2024'అవకాశం కల్పించింది. ఈ నెల 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు దరఖాస్తుదారులు తమ తప్పులను సవరించుకోవచ్చని 'టిఎస్ లాసెట్, పిజిఎల్‌సెట్ 2024' కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు https://lawcet. tsche.ac.in/. వెబ్ సైట్‌ను సంప్రదించాలని సూచించారు. కాగా రూ.2వేల ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 20వ తేదీ చివరి అవకాశం ఉన్నది.

### ప్రబీర్ పురకాయస్థ అరెస్టుపై
## సుప్రీంకోర్టు రూలింగ్‌కు ఐజెయు హర్షం

**చండీగఢ్ :** సీనియర్ జర్నలిస్టు, న్యూస్ క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్ వ్యవస్థాపకులు ప్రబీర్ పురకాయస్థ అరెస్టు అక్రమమని సుప్రీం కోర్టు రూలింగ్ ఇవ్వడాన్ని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) స్వాగతించింది. ఈ మేరకు ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి, సెక్రెటరీ జనరల్ బల్వీందర్ సింగ్ జమ్మూ గురువారం ఒక ప్రతికా ప్రకటనను విడుదల చేశారు. స్వతంత్ర జర్నలిజం, అసమ్మతి పట్ల తీవ్రమైన అసహనాన్ని పెంచుకున్న , నియంతృత్వ ధోరణితో పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. నాగరిక సమాజంలో నిరంకుశ చట్టాలకు స్థానం లేదని వారు పేర్కొన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కుల విషయంలో చర్చకు తావులేదని, అత్యున్నత న్యాయస్థానం పదే పదే పలు సమయాలలో చెబుతున్నప్పటికీ ప్రభుత్వం దాని నుండి నేర్చుకోవడం లేదని అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును పదిలపరుస్తూ రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికారణ నుండి వెలువడిన మీడియా స్వేచ్ఛను ప్రభుత్వాలు గౌరవించాలని ఐజెయు నేతలు విజ్ఞప్తి చేశారు.

## మోదీకి శ్రీకాశీవిశ్వనాథుడు జ్ఞానోదయం కలిగించాడా?

### టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్ సూటి ప్రశ్న

**ప్రజాపక్షం /హైదరాబాద్:** ''ప్రధాని నరేంద్రమోడీకి వారణాసిలో శ్రీకాశీవిశ్వనాథుడు జ్ఞానోదయంకలిగించాడా? పవిత్రగంగామాతా తన పవిత్ర జలంతో ఆయనలో పరివర్తన తెచ్చిందా? లేక ఆయనే ఊసరవెల్లిలా రంగు మార్చ డా అనే అనుమానం కలుగుతుంది'' అని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రధాని మోడీ ఈనెల 14వ తేదీన పవిత్రగంగానదిలో ఒక నావలో విహరిస్తూ ఒక జాతీయ చానెల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ 'నేను హిందూ ముస్లింలనువిడదీయను, అలా చేస్తే రాజకీయాలకు అర్హుడినే కాదు. నేను ఎప్పుడూ హిందూ ముస్లింల విభజన రాజకీయంచేయ ను. ఇది నా సంకల్పం' అని అని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. ముస్లింలు ఎక్కువ పిల్లలు కంటారనిచెప్పలేదని, పేదవారు ఎక్కువ పిల్లలను కంటారని చెప్పడం పూర్తిగా అబద్ధమన్నారు. గత నెల రోజులుగా మోడీ విద్వేషం రెచ్చగొట్టే ప్రసంగాలు విన్నప్రజలకు, ఆయన నోటి వెంట ఈ వ్యాఖ్యలు రావడం విస్మయానికి గురిచేస్తోందన్నారు.

## పట్టభద్రులపై పట్టు ఎవరిదో?

### 27న పోలింగ్..జూన్ 5న కౌంటింగ్



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల సందడి ముగియడంతో ఇక అందరి దృష్టి మరో ఎన్నికపై పడింది. గడచిన నెలన్నర రోజులుగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తలమునకలైన పార్టీలకు విశ్రాంతి లేకుండా మరో ఎన్నిక వచ్చి పడింది. గతంలో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలలో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన రాజీనామా అనివార్యమైంది. దీంతో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికను ఆరు నెలల్లోనే నిర్వహించాల్సి న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక అనివార్యం కావడంతో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం నామినేషన్ల ఘట్టం ముగియడంతో 52మంది బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ ఉప ఎన్నికను ఈ నెల 27న నిర్వహించేందుకు ఎన్నికల షధికారులు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ఇప్పటికే వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఓటర్ల జాబితాను ఖరారుచేసిన అధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. పట్టభద్రుల ఉప ఎన్నికను ఈ నెల 27న బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించి జూన్ 5న ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 జిల్లాల లో మొత్తం 305 పోలింగ్ కేంద్రాలను ఈ ఉప ఎన్నికల కోసం ఏర్పాటు చేశారు. మొత్తం 4.63 లక్షల మంది పట్టభద్రులు ఈ ఎన్నికలలో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.
**పట్టభద్రుల బరిలో 52 మంది**
కాగా వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు రంగంలో నిలిచారు. ఈ ఎన్నికలో ప్రధాన పార్టీలతో పాటు పెద్దఎత్తున స్వతంత్ర అభ్యర్థులు కూడా రంగంలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థులలో వివిధ విద్యా సంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయ, మేధావులు, విద్యార్థులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ నుండి ఏనుగుల రాకేష్ రెడ్డి, బిజెపి నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బరిలో నిలిచారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికబరిలో 52 మంది ఉన్నప్పటికీ ఈ మూడు ప్రధాన పార్టీలు మద్దతిచ్చే అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. వీరిలో చింతపండు నవీన్ అలియస్ తీన్మార్ మల్లన్న ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించగా మిగిలిన అభ్యర్థులు ప్రచారానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో పాటు విద్యా, ఉద్యోగ వర్గాలు, తీన్మార్ మల్లన్న టీం, ఇతర కలిసి వచ్చే వర్గాలతో గెలుపుకోసం ప్రయత్నిస్తున్నారు. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ద్వితీయ స్థానంలో నిలిచారు.
**కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపిల మధ్యే పోటీ**
గతంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి స్వల్ప తేడాతో ఓడిన తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ నుండి పోటీచేస్తున్నారు. బిఆర్‌ఎస్ నుండి గత అసెంబ్లీ ఎన్నికల ముందు బిజెపి నుండి బిఆర్‌ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేష్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో మొదటినుండి తెలంగాణ ఉద్యమంలో ఉన్న వారిని కాదని రాకేష్ రెడ్డికి ఇచ్చారంటూ బిఆర్‌ఎస్‌లోని ఒక వర్గం అంటీముట్టనట్లుగా అసంతృప్తితో ఉంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం కెయు విద్యార్థి జెఎసి నాయకుడు, రాష్ట్ర వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ వసుదేవ రెడ్డి, విద్యాసంస్థల అధినేత, మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ప్రయత్నించినా బిఆర్‌ఎస్ రాకేష్ రెడ్డినే అభ్యర్థిగా ప్రకటించడంతో అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. ఇక బిజెపి నుండి గతంలో ఎమ్మెల్సీగా పోటీచేసిన గుజ్జుల ప్రేమందర్ రెడ్డినే తిరిగి అభ్యర్థిగా ప్రకటించారు. గతంలో రెండుసార్లు గుజ్జుల ప్రేమందర్ రెడ్డి పోటీచేయగా ముచ్చటగా మూడోసారి ఆయనకే టికెట్ కేటాయించా రు. దీంతో వీరి ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

### ఇక ఎంఎల్‌సి పోరు
## దృష్టి సారించిన కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి

**ప్రజాపక్షం/ఖమ్మం:** శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ప్రచారం మొదలైంది. నామినేషన్ల అనంతరం ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 52 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. గత ఎన్నికల్లో నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజక వర్గం నుంచి ఎన్నికైన పల్లా రాజేశ్వరరెడ్డి గతేడాది నవంబరులో జరిగిన శాసన సభ ఎన్నికల్లో జనగాం నుంచి శాసనసభకు ఎన్నికై శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. గత ఎన్నికల్లో హోరాహోరీగా జరిగిన పోరులో పల్లా రాజేశ్వర రెడ్డి బిఆర్‌ఎస్ మద్దతుతో శాసన మండలికి ఎన్నికైన విషయం విదితమే. రాష్ట్రంలోని కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు ఈ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకోవాలని పావులు కదుపుతున్నాయి. కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్‌కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ నుంచి ఏనుగు రాకేష్‌రెడ్డి, బిజెపి నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి లు పోటీలో ఉండగా వీరితో పాటు మొత్తం 52 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. మొత్తం 12 జిల్లాలకు విస్తరించిన ఈ పట్టభద్రుల శాసన మండలి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే కింది స్థాయి శ్రేణులను సమాయత్తం చేసింది. పట్టభద్రులను కలిసి తీన్మార్ మల్లన్నను గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరించాలని నాయకత్వం కోరింది. తీన్మార్ మల్లన్న గత శాసన మండలి ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి అప్పటి అధికార బిఆర్‌ఎస్ పార్టీతో హోరాహోరీగా తలపడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థులను వెనక్కి నెట్టి రెండవ స్థానంలో నిలిచారు. ఇప్పుడు మల్లన్నకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించింది. బిజెపి నుంచి కొద్ది నెలల క్రితం బిఆర్‌ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని బరిలో దింపిన బిఆర్‌ఎస్ ఇప్పటికే ఈ శాసన మండలి పరిధిలోని నాయకులతో సమావేశం నిర్వహించింది. ఓటమి తర్వాత అంత హుషారు లేని నాయకత్వాన్ని సమాయత్తం చేసేందుకు కెటిఆర్ బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఒక సమావేశాన్ని నిర్వహించారు. బిజెపి నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ప్రేమేందర్‌రెడ్డి తిరిగి పోటీ చేస్తున్నారు. మొత్తం శాసన మండలి ఓటర్లుగా 4,63,839 మంది నమోదయ్యారు. అత్యధికంగా ఖమ్మంజిల్లాలో 83,879 మంది ఓటర్లు ఉండగా ఆ తర్వాత స్థానంలో సూర్యాపేట 51,497 మంది ఓటర్లు ఉన్నారు.
అత్యల్పంగా సిద్దిపేటలో 4,679 మంది ఓటర్లు ఉన్నారు. 12 జిల్లాల పరిధిలో మొత్తం 605 బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 27న పోలింగ్ జరగనుండగా జూన్ ఐదున లెక్కింపు నిర్వహించనున్నారు. ఎన్నికలకు మరో 10 రోజులు మాత్రమే సమయం ఉండడంతో అభ్యర్థులు ప్రచారం పైనా దృష్టి సారించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచార బడలిక నుంచి తెరుకుని నేతలు పట్టభద్రుల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

## బిజెపికి కెసిఆర్ ఓట్లు వేయించారు : కెకె మహేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి బిఆర్‌ఎస్ నాయకులే ఓట్లు వేపించారని కాంగ్రెస్ నాయకుడు కె.కె. మహేందర్ రెడ్డి ఆరోపించారు. కల్వకుంట్ల కవితను జైలు నుండి విడిపించేందుకే బిజెపికి కెసిఆర్ ఓట్లు వేయించారన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిశాల రాజేందర్‌తో కలిసి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తమ రాజకీయ భవిష్యత్తు కోసం మోదీ వద్ద బిఆర్‌ఎస్ మొకరిల్లిందని, మోదీ కనుసన్నల్లో నే కెసిఆర్ ఉన్నారని ఆరోపించారు.కెటిఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బతుకమ్మ చీరల పేరుతో కెటిఆర్ దోపిడీ చేశారని ఆరోపించారు. వెలిశాల రాజేందర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో బిఆర్‌ఎస్ రెండో స్థానానికి వస్తే తాను దేనికైనా సిద్ధమేనని,మూడో స్థానంలో ఉంటే కెటిఆర్ తన ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేస్తారా?అని ప్రశ్నించారు. కెటిఆర్ సిరిసిల్లకు ఒక వలస పక్షి అని ఎద్దేవా చేశారు. నేతన్నల మరణానికి కెటిఆర్ కారణమని ఆరోపించారు

## కెసిఆర్...విద్యుత్ సంస్థలపై అసత్యాలు మానుకో



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 24 గంటలూ నిరంతరం విద్యుత్ సరఫరా అందజేసేందుకు కృషి చేస్తున్న విద్యుత్‌శాఖను, ఉద్యోగులను బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం పనిగట్టుకుని అభాసుపాలు చేసే యత్నాలు మానుకోవాలని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోరింది. ఈ ఏడాది రాష్ట్రంలో 15623 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను అవలీలగా చేరుకొని, రాష్ట్రంలోని 1.82 కోట్లమంది విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా కొరకు తమ ఉద్యోగులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని వెల్లడించింది. ఈ మేరకు ఫెడరేషన్ నేతలు డి.కోటేశ్వరరావు,(డిఈ),ఎ.శంకర్(డిఈ),రామకృష్ణ(రిటైర్డ్ ఎస్‌ఇ), కె. శంకర్ (ఎడిఈ)లు గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడు తూ బిఆర్‌ఎస్ నేతలు పనిగట్టుకుని సరఫరా విషయంలో విద్యుత్ సంస్థలపై అసత్య ప్రచారాలు వ్యాప్తిచేస్తూ విద్యుత్ అధికారులను సిబ్బందిని మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో పనిచేసిన తమ ఉద్యోగులు అప్పుడు బాగాచేసి ఇప్పుడు చేయనట్లు అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. విపక్షా లు చేస్తున్న ఈ విమర్శలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యుత్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం కూడా తమను అభినందిస్తోందని వారు పేర్కొన్నారు. గత తొమ్మిదేండ్ల కాలంలో తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిన విద్యుత్ సంస్థలకు నష్టాల నుండి గట్టెక్కించేందుకు గాను ప్రతిష్ఠాత్మక ఐఐటిల్లో ఇంజినీరింగ్ పట్టభద్రులైన ఐఎఎస్ అధికారులను సిఎండిలుగా నియమించి విద్యుత్ సంస్థల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డికి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకి ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు.

ప్రజాపక్షం
శుక్రవారం, మే 17

# ఎన్నికల్లో 'ఎఐ' ఎఫెక్ట్

సోషల్ మీడియాలో, కృత్రిమ మేధ (ఎఐ), 'డీప్ ఫేక్' పుణ్యమా అని ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొంది. సార్వత్రిక ఎన్నికల వేళ, ప్రజలను మరింత గందరగోళానికి గురి చేస్తున్నది. ఎవరో వీడియోకు, ఇంకెవరి మొహాన్నో జోడించడమే డీప్ ఫేక్. ఎఐ హ్యాండిల్స్‌తోనే ఇలాంటి వీడియోలు సాధ్యం. ఫొటో మార్ఫింగ్ సమస్యకు పూర్తిగా తెరపడకముందే, డీప్ ఫేక్ సాంకేతికత ప్రమాదాలు సృష్టిస్తున్నది. జాతీయ స్థాయి నాయకుల ఎన్నికల ప్రచారం పేరుతో వస్తున్న వీడియోల్లో అసలు, నకిలీ తేడా కనుక్కోవడం ప్రజలకు అసాధ్యంగా మారింది. ప్రధాని నరేంద్ర మోదీ లేదా ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లేదా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ.. ఇలా దేశ రాజకీయాల్లో కీలకంగా ఉన్న ఎంతో మంది నేతలు ఒకే చోట చేరడం విచిత్రం కాకపోవచ్చు. కానీ, ఒకేసారి ఒక షోలో కలిసి డాన్స్ చేయడమో లేక స్ప్రింట్ ఈవెంట్‌లో పరుగులు తీయడమో సాధ్యం కాదన్నది వాస్తవం. కానీ, అలాంటి వీడియోలు పుట్టుకొస్తున్నాయి. వీటిని ప్రజలు పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కానీ, ఉపన్యాసాల వీడియో క్లిప్పింగ్స్‌కు ఇష్టానుసారంగా ఆడియోను జోడించినప్పుడు, గుర్తించడం కష్టం. క్రమంగా వేళ్లూనుకుంటున్న కృత్రిమ మేధ (ఎఐ), డీప్ ఫేక్ వంటి సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై కేంద్ర ప్రభుత్వం ఇంత వరకూ స్పందించకపోవడం శోచనీయం. చాలా దేశాలు ఇప్పటికే జాగ్రత్త చర్యలు మొదలుపెట్టినప్పటికీ, మోదీ సర్కారులో కదలిక లేదు. ఎంతో మంది రాజకీయ నాయకులు గతంలో మనం ఎన్నడూ చూడని అవతారాల్లో కనిపించడం వెనుక ఎఐ సాధనాలే ఉన్నాయి. షాహిద్ షేక్ వంటి కంటెంట్ క్రియేటర్లు జాతీయ నాయకులను మనం గతంలో ఎన్నడూ చూడని రూపాల్లో చూపిస్తున్నారు. పాటలు పాడిస్తున్నారు. డాన్స్‌లు, ఫైటింగ్‌లు చేయిస్తున్నారు. ఈ టూల్స్ మరింత ఆధునికతను సంతరించుకోవడంతో, ఇప్పుడు తప్పుడు వార్తలు నిజాలుగా చలామణ అవుతున్నాయని నిపుణుల ఆందోళన. పుకార్లు ఎప్పుడూ ఎన్నికల్లో ఒక భాగమే. కానీ, ప్రస్తుత 'సోషల్ మీడియా యుగం'లో ఈ సమస్య తీవ్ర రూపం దాల్చింది. తప్పుడు సమాచారం దేశ రాజకీయాలను, ప్రజాస్వామ్య విధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) మాజీ చీఫ్ ఎస్‌వై ఖురేషి హెచ్చరికను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఇప్పటికే కొంత మంది నాయకుల విద్వేషపూరిత ప్రసంగాలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎఐ, డీప్ ఫేక్ సాంకేతికతో వెల్లువెత్తుతున్న వీడియోలు దేశంలో అంతర్యుద్ధ పరిస్థితులను సృష్టించినా ఆశ్చర్యం లేదు. అయితే, ఎన్నికల్లో ఎఐ టూల్స్ వల్ల నష్టమే తప్ప లాభం లేదనుకోవడానికి వీల్లేదు. ఎంతో మంది నేతలు తమతమ ఉపన్యాసాలను ఇతర భాషల్లో అనువాదానికి ఎఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. ఎన్నో సందేశాలను ఓటర్లకు చేరవేయడంలోనూ ఈ ఎఐది కీలక భూమిక. గతంలో ఓటర్లను ఉద్దేశిస్తూ చేసే ప్రసంగాల వీడియోలు చేయడానికి వారం పది రోజులు పట్టేది. ఇప్పుడు కొన్ని గంటల్లోనే వీడియోలు సిద్ధమవుతున్నాయి. అన్ని భాషల్లోకి తర్జుమా అవుతున్నాయి. బలంగా ప్రజల్లోకి వెళుతున్నాయి. సరైన పద్ధతిలో వాడుకుంటే దేశ కల్యాణానికి ఉపయోగపడే ఎఐ సాంకేతిక పరిజ్ఞానం, తప్పుడు మార్గాల్లో ఉపయోగిస్తే వినాశనాన్ని, విధ్వంసాన్ని సృష్టిస్తుంది. ప్రాణాలు నిలబెడుతున్న సాంకేతిక పరిజ్ఞానమే ఆయుధాల రూపంలో ప్రాణాలు తీస్తున్నది. రెండు అంచుల కత్తి ఎఐ పరిజ్ఞానం తప్పుతోవ పట్టకుండా, సంఘ విద్రోహుల చేతిలో పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మార్గదర్శకాలను నిర్దేశించాలి. ప్రత్యేక చట్టాలు రూపొందించి, పకడ్బందిగా అమలు చేయాలి. ప్రభుత్వంలో శ్రద్ధ, చిత్తశుద్ధి లోపిస్తే, సమీప భవిష్యత్తులో పెను ప్రమాదాలు తప్పవు.

## చాబహార్ పోర్టు అభివృద్ధిలో
# భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలు

గిరిష్ లింగన్న

పశ్చిమ ఆసియాలో ముఖ్యమైన దేశం ఇరాన్‌తో సంబంధాలు వృద్ధి చేసుకునే ఉద్దేశంతో భారతదేశం చాబహార్ ఓడరేవు అభివృద్ధి–నిర్వహణ ఒప్పందం చేసుకుంది. రెండు దేశాలమధ్య సహకారాన్ని పెంపొందించుకోవడానికి చాబహార్ ఓడరేవు అభివృద్ధికి ఇరాన్‌తో పదేళ్ళ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు భారత ప్రభుత్వం మే 13వ తేదీ సోమవారంనాడు ప్రకటించింది.

ఒమన్ సముద్రతీరంలో ఉన్న ఆగ్నేయ ఇరాన్‌లో ఉన్న చాబహార్ ఓడరేవు అభివృద్ధి పనుల్లో భారత ప్రభుత్వం ఎంతో క్రియాశీలంగా భాగస్వామి అయింది. మధ్యాసియాలోని ఇరాన్, అఫ్గానిస్థాన్ వంటి దేశాలకు సముద్రమార్గంలో సరుకులు చేరవేయడానికి ఒక కీలకమైన రవాణా మార్గంగా ఈ చాబహార్ ఓడరేవు సేవలు అందిస్తుం ది.ఈ ఓడరేవును ఉపయోగించుకోవడంద్వా రా మనదేశం దాయాదిదేశమైన పాకిస్థాన్‌లోని కరాచీ, గదర్ వంటి ఓడరేవులకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఈ ప్రాంతంలో చుట్టుమార్గం లేకుండా అత్యంత సులభపద్ధతుల్లో వాణిజ్య అనుసంధానాలు కొనసాగించేందుకు వీలు కలుగుతుంది. ఇరాన్–ఇండియా మధ్య సులభమైన అనుసంధా నం ఒక్కటి మాత్రమే కాకుండా ఈ ఓడరేవుకు లెక్కకుమిక్కిలి ప్రాధాన్యతలు ఉన్నాయి. ముందే చెప్పినట్టు సెంట్రల్ ఆసియా దేశాలను భారత్‌తో అనుసంధానం చేయడానికి ఇది అత్యంత కీలకమైన సముద్ర మార్గం. మనదేశ నౌకాయానమంత్రి సర్బనంద సోనేవాల్ టెహ్రాన్‌లో ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత ఈ విషయాలనే చాలా ప్రముఖంగా ముందుకు తెచ్చారు.ఈ ప్రాంతంలో సరఫరా వ్యవస్థకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా నిరంతరాయంగా రాకపోకలు కొనసాగిస్తూ, వాణిజ్య కార్యకలాపాలను పటిష్టం చేసుకోవడానికి మనదేశానికి అనేక తాజా అవకాశాలకు తెరతీసేవిధంగా ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపిజిఎల్), పోర్ట్ అండ్ మెరైన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇరాన్ మధ్య ఈ దీర్ఘకాలిక ఒప్పందం జరిగింది. ఇరాన్ దేశ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖతామి 2003లో భారతదేశంలో పర్యటించినప్పుడు చాబహార్ ఓడరేవు అభివృద్ధికి రెండు దేశాలమధ్య ఈ భాగస్వామ్య ఒప్పందం జరిగినప్పటికీ, ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా దాన్ని అమలు చేయడంలో రెండు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టు అనేక ఆటంకాలకు గురైంది. తర్వాత 2016లో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇరాన్‌లో పర్యటించినప్పుడు రెండు దేశాల నౌకాయాన మంత్రుల మధ్య పునరుద్ధరించిన ఒప్పందంపై టెహ్రాన్‌లో సంతకాలు జరిగాయి. ఇరాన్ రోడ్లు, పట్టణాభివృద్ధిశాఖామంత్రి మెహర్దాద్ బాజ్‌పాష్ చెప్పిన ప్రకారం, ఈ ప్రాజెక్టుకోసం ఐపిజిఎల్ నుండి సుమారుగా 120 మిలియన్ డాలర్లు పెట్టుబడులు సమకూరుతాయి. మరో 250 మిలియన్ డాలర్లు ద్రవ్య సహాయం సమకూరుతుంది. ఆ విధంగా మొత్తం 370 మిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టు పనులు భారత్ చేపడుతున్నది. ఒప్పంద నిబంధనల ప్రకారం మొబైల్ హార్బర్ క్రేన్లు, ఓడలను లంగరు వేసేందుకు వీలుగా ఒడ్డును, సముద్ర జలాలతో అనుసంధానం చేస్తూ కంటైనర్లను నడిపించే భారీ క్రేన్లు, భారీ బరువులను మోసుకుపోయే వివిధ రకాల సంచార క్రేన్లు, రైల్ ఆధారిత క్రేన్లు, అన్‌లోడర్లు వంటి అన్ని రకాల సామాగ్రిని భారతదేశమే ఈ ఓడరేవుకు సమకూర్చాలి. ఈ ఒప్పంద ప్రయోజనాల ప్రకారం భారతదేశ ఆర్థికవృద్ధికి, అభివృద్ధికి ఈ ఓడరేవు ఎంతోబాగా ఉపయోగపడుతుంది.

ఐపిజిఎల్ 2018లో ఈ ఓడరేవును తన నియంత్రణలోకి తీసుకున్నప్పటినుండీ ఈ లావాదేవీల్లో సరుకు రవాణా 90,000 టిఇయులను, సాధారణ సరుకు రవాణా 8.4మిలియన్ టన్నుల ను దాటింది.

**మానవ సహాయం, ప్రాంతీయ అనుసంధానంలో చాబహార్ పాత్ర**

మానవ సహాయాన్ని చేరవేయడంలో ప్రత్యేకించి కరోనా మహమ్మారి విజృంభించినకాలంలో చాబహార్ ఓడరేవు ఎంతో కీలకమైన పాత్ర నిర్వహించింది. ఈ ఓడరేవు ద్వారా 2.5 మిలియన్ టన్నుల గోధుమలు, 2,000టన్నుల పప్పుధాన్యాలు, తృణధాన్యాలను భారత్ నుండి ఎంతో సమర్థవంతంగా అఫ్గానిస్థాన్‌కు రవాణా చేసింది. అదనంగా 2021లో వ్యవసాయ పంటను ఆశ్రయించి ఉండే క్రిమికీటకాదులను నిర్మూలించగల 40,000 లీటర్ల మీథేన్ పురుగుల మందులను ఇరాన్‌కు తరలించింది. భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ మే 13న ముంబయిలో జరిగిన పత్రికాగోష్ఠిలో ఈ విషయాలు చెప్పారు. ఈ ఓడరేవు రాబోయేకాలంలో ఒక అంతర్జాతీయ రవాణా కారిడార్‌గా వృద్ధి చెందుతుంది. ఇరాన్–రష్యా సంయు క్త నేపథ్యంలో ఈ అభివృద్ధి ముందుకు వెళుతుంది. తద్వారా సెంట్రల్ ఆసియాతో వాణిజ్య సంబంధాలు మరింత పటిష్టం అవుతాయి. ఓమన్ సముద్ర తీరం ముఖద్వారం వద్ద లోతైన సముద్ర జలాలల్లో ఉన్న ఇరాన్‌దేశ మొట్టమొదటి ఓడరేవు ఈ చాబహార్. అంతర్జాతీయ సముద్ర వాణిజ్య మార్గంలో చాలా కీలకప్రాంతంలో ఇరాన్‌కు చెందిన సిస్టాన్–బలూచిస్థాన్ రాష్ట్రంలో ఉంది. అదేవిధంగా పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్టానికి నైరుతీ దిశలో 120 కి.మీ దూరంలో ఉంది. చైనా ఏర్పాటు చేసిన గదర్ ఓడరేవు ఈ ప్రాంతంలోనే ఉంది. అందువల్ల అటు భారత్, ఇటు ఇరాన్ రెండు దేశాలకూ కూడా చాబహార్ వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యత గల ఓడరేవు. ఇరాన్‌కు సంబంధించి పాశ్చాత్యదేశాలు విధించే ఆంక్షలను తట్టుకుని నిలబడటానికి ఈ ఓడరేవు ఉపయోగపడుతుంది. అదేసమయంలో భారతదేశానికి కూడా పాకిస్థాన్ ఓడరేవులను ఆశ్రయించకుండా అఫ్గానిస్థాన్‌కు, సెంట్రల్ ఆసియా దేశాలకు అందుబాటులో ఉండేవిధంగా ఒక ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గంగా దోహదపడుతుంది. ఈ ఓడరేవు ప్రాజెక్టులో రెండు వేరువేరు ఓడరేవులు ఉన్నాయి. షాహిద్ బెహెస్తి, షాహిద్ కాలాంతరి టర్మినల్స్ అని ఈ రెండు ఓడరేవులను పిలుస్తారు. ఒక్కొక్క ఓడరేవులోనూ ఐదు బెర్తులు ఉన్నాయి. ఐతే భారత్ పెట్టుబడులు మాత్రం కేవలం షాహిద్ బెహస్తి ఓడరేవుకు మాత్రమే పరిమితం. తమ 'భారత్–ఇరాన్– చాబహార్' ఓడరేవు ప్రాదేశిక భౌగోళిక రాజకీయాలు' అనే పత్రంలో ఇరాన్‌లోని ఇస్ఫహాన్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు ఒమిది, గౌరీ నూల్కర్‌ఓక్ ఈ విషయాలను పొందుపరిచారు.

**భారత్,రష్యా,యూరప్‌లకు ప్రయోజనాలు**

ఇక ఈ చాబహార్ ఓడరేవు ప్రాజెక్టు అంతర్జాతీయ ఉత్తరదక్షిణ ప్రాంత కారిడార్ (ఐఎన్ఎస్‌టిసి) గా విస్తారమైన రవాణా కార్యకలాపాల నిర్వహణలో భావికాలంలో ఒక మార్గదర్శకమైన పాత్ర పోషించనున్నది. 7,200 కిలోమీటర్ల పరిధిలో దీని కార్యకలాపాలు విస్తరిస్తాయి. సముద్ర మార్గంతోపాటు రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్, భారత్‌లోని ముంబయి నగరాలకు రోడ్లు, రైల్వే మార్గాలు కూడా ఈ ప్రాజెక్టులో అనుసంధానమై ఉన్నాయి. ఈ ఐఎన్ఎస్‌టిసి పరిధిలో 13 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. భారత్, ఇరాన్, రష్యా, టర్కీ, అజర్‌బైజాన్, కజఖస్థాన్, ఆర్మేనియా, బెలారస్, తజికిస్థాన్, కిర్గిస్థాన్, ఓమన్, ఉక్రేన్, సిరియా దేశాలతోపాటు అదనంగా బల్గేరియా కూడా ఈ ఐఎన్ఎస్‌టిసిలో ఒక పరిశీలక భాగస్వామిగా ఉన్నది. ముంబయిలో ఉన్న సరుకుల ఉత్పత్తి ప్రదేశం నుండి ఈ షాహిద్ బెహెస్తి ఓడరేవు ద్వారా ఇరాన్ సహా వివిధ లక్షిత ప్రదేశాలకు ప్రధానంగా సముద్రమార్గంలో వినియోగదారులకు తక్కువ ఛార్జీలకు సరుకు సరఫరాచేసే ఒక వ్యూహాత్మక మార్గంగా ఈ ప్రాజెక్టు దోహదపడుతుంది. ఆ విధంగా కాస్పియన్ సముద్రంలో ఇరాన్‌కు ఉన్న ఓడరేవు బాందర్‌అంజాలీ వరకూ చాబహార్ ఓడరేవు నుండి సరుకులను రహదారిమార్గంలో తరలిస్తారు. అటుపిమ్మట కాస్పియన్ సముద్రం మీదుగా రష్యా ఫెడరేషన్‌లో ఉన్న ఆస్ట్రఖాన్ ఓడరేవుకు కూడా సరుకులను సులభంగా రవాణా చేస్తారు. చిట్టచివరగా ఈ సరుకును అస్ట్రఖాన్ ఓడరేవు నుండి రష్యాలో ఉన్న వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. అక్కడి నుండి తదుపరి రష్యా రైల్వేమార్గాలను ఉపయోగించడంద్వారా యూరప్‌లోని వివిధ ప్రాంతాలకు కూడా ఈ సరుకులను తరలిస్తారు.

ఈ అంతర్జాతీయ ఉత్తర–దక్షిణ సరుకు రవాణా నడవా (ఐఎన్ఎస్‌టిసి)సంపూర్ణస్థాయిలో అందుబాటులోకి వస్తే సరుకు రవాణా తరలింపు సమయం 40శాతం మేరకు తగ్గిపోతుంది. అంటే ప్రస్తుతం 45నుండి 60రోజులపాటు సరుకు రవాణాకు జరుగుతున్న సమయం ఈ చాబహార్ ప్రాజెక్టు ద్వారా తగ్గిపోయి,25 లేదా 30 రోజులకే ఉత్పత్తిస్థానం నుండి వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది. అంతేకాకుండా, విమానం ద్వారా జరిగే సరుకు రవాణా ఖర్చులు కూడా గణనీయంగా ఈ ప్రాజెక్టువల్ల తగ్గిపోతాయి. సూయిజ్ కెనాల్ మార్గం ఉపయోగించినప్పుడు జరిగే ఖర్చులతో పోల్చిచూస్తే ఈ కారిడార్ ద్వారా విమాన రవాణా ఖర్చులు 30 శాతం తగ్గిపోతాయి. *(ఐపిఎ)*

## అమెరికా కడుపుమంట!



చాబహార్ ఓడరేవు అభివృద్ధికై ఇరాన్–భారత్ మధ్య కుదిరిన దశవర్ష ఒప్పందంవల్ల 'ఆంక్షల'కు గురయ్యే ప్రమాదం లేకపోలేదని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వ్యాఖ్యానించారు. అమెరికా 2018లో భారత్‌కు ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. ఆ రేవు రెండవదశ అభివృద్ధికై భారత్ పెట్టుబడులకు ఆ మినహాయింపు వర్తిస్తుందా అనే సందేహాలు తలెత్తాయి. భారత్‌కు మినహాయింపులకు వ్యతిరేకం గా అమెరికా నిర్ణయించినట్లయితే ఆ పెట్టుబడులు ఆంక్షల కిందకు వస్తాయి. భారత్ ఆ రేవు అభివృద్ధికి 12 కోట్ల డాలర్ల యంత్రాలు సరఫరా చేస్తుంది; 25 కోట్ల డాలర్లు రుణం ఇస్తుంది. 'ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు కొనసాగుతున్నాయి. వాటి అమలును కొనసాగిస్తారు' అన్నారు ఆ ప్రతినిధి.

చాబహార్ ఓడరేవు ఈ ప్రాంతానికి ప్రయోజనకరమని అమెరికాకు నచ్చజెపుతాం అన్నారు భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్. అఫ్గానిస్థాన్‌కు సహాయం, వాణిజ్యానికి ఆ ఓడరేవు ఉపయోగకరమని లోగడ అమెరికా అంగీకరించింది. అందువల్ల అమెరికా ఇతరులు 'సంకుచిత దృక్పథం' తీసుకోరాదని జైశంకర్ కోల్‌కతాలో అన్నారు.

## మాట మార్చిన అమిత్ షా!



బిజెపిలో ఎవరైనా 75 ఏళ్ల వయసు తర్వాత క్రియా శీలక రాజకీయాల నుంచి వైదొలగాల్సిందేనని ఐదేళ్ల క్రితం ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా అప్పుడు మాట మార్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 తర్వాత కూడా రాజకీయాల్లో కొనసాగుతారని ప్రకటించి, పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ ప్రవృత్తికి అద్దం పట్టారు. 2019లో ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, 75 సంవత్సరాలు నిండిన వారు ఎవరూ ఎన్నికల్లో పోటీ చేయరాదని పార్టీ నిర్ణయించిందని అన్నారు. ఎల్‌కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి అత్యంత సీనియర్ నేతలతోసహా ఈ నిర్ణయం అందరికీ వర్తిస్తుందని గొప్పగా ప్రకటించారు. పార్టీ తీసుకున్న నిర్ణయంలోమార్పులు ఉండబోవని ప్రకటించారు. కానీ, ఇప్పుడు ఆయన మాట మారింది.కేంద్రంలో మరోసారి బిజెపి ప్రభుత్వం వస్తుందని ఆ పార్టీ నాయకులంతా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానిగా మోదీ 'హ్యాట్రిక్' తప్పదని అంటున్నారు. అయితే, వచ్చే సంవత్స రం 75 ఏళ్లు పూర్తికానున్న మోదీ, పార్టీ నిర్ణయం ప్రకారం రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకోవాలి. అంటే, ఒకవేళ బిజెపి అధికారాన్ని నిలబెట్టుకుంటే, మోదీ రెండు సం.లు మాత్రమే పదవిలో ఉంటారు. ఆ తర్వాత, మిగతా మూడు సంవత్సరాలు ఆ పదవిని మరొకరికి అప్పగించాలి. కానీ, అద్వానీ, జోషి విషయంలో కఠినంగా ఉన్న అమిత్ షా, ఇప్పుడు మోదీ విషయంలో మాత్రం యూటర్న్ తీసుకున్నారు. 2029వరకూ ప్రధానిగా మోదీ నే ఉంటారని గ్యారంటీ ఇచ్చారు. ఈ ఐదేళ్లలో దేశం మరింత ఉన్నత స్థాయి కి చేరుతుందంటూ ఓ ట్యాగ్ కూడా జత చేశారు. క్రమశిక్షణ, మాటమీద నిలబడడం వంటి లక్షణాలు తమకు తప్ప మరెవరికీ లేవన్నట్టు గొప్పలు చెప్పుకొనే బిజెపి తీర్మానాలు, సూత్రాలు మోదీకి వర్తించవా?

## సోషల్ మీడియాలో ఫేక్ వీడియో చక్కర్లు

హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం, బహదూర్‌పురాలో ఒక వ్యక్తి రిగ్గింగ్‌కు పాల్పడుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నది. ఎంఐఎం కార్యకర్త ఒకరు పోలింగ్ బూత్‌ను తన ఆధీనంలోకి తీసుకొని, ఓటు వేయడానికి వచ్చిన వారికి సిబ్బంది ఇంకుతో గుర్తువేసిన వెంటనే, వెనక్కు పంపుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లో తానే ఓటు వేస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) దృష్టికి వెళ్లే వరకూ ఈ వీడియోను షేర్ చేయాలంటూ విజ్ఞప్తిని కూడా ట్యాగ్ చేశారు. అయితే, ఫాక్ట్ చెకింగ్‌లో పరిశీలిస్తే, ఇది 2022 లో, పశ్చిమ బఎంగాల్ మున్సిపల్ ఎన్నిలకు సంబంధించిన వీడియోగా తేలింది. దండం మున్సిపాలిటీ 33వ వార్డు, 106వ బూత్‌కు సంబంధించిన ఈ వీడియో అప్పట్లో పశ్చిమ బెంగాల్‌ను కుదిపేసింది. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) కార్యకర్త ఈ విధంగా రిగ్గింగ్ పాల్పడ్డాడని అరోపిస్తూ కాంగ్రెస్ ఈ వీడియోను విడుదలు చేసింది. దానికీ, హైదరాబాద్ నియోజకవర్గంలో ఈనెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌కు ఎలాంటి సంబంధం లేదు. దేశంలో అత్యంత సున్నితమైన నియోజకవర్గాల్లో ఒకటైన హైదరాబాద్‌లో జరిగినట్టు తప్పుడు ప్రచారం చేయడం వెనుక ఎవరి ప్రమేయం ఉందో ఊహించుకోవడం కష్టం కాదు.



హైదరాబాద్ నియోజకవర్గంలో పోటీ బిజెపి, ఎంఐఎం మధ్యే ఉందనేది అందరికీ తెలిసిందే. ఎంఐఎం బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడిందన్న ఆరోపణలు చేయాల్సిన అవసరం బిజెపి తప్ప, మరే ఇతర పార్టీకీ లేదు. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దని అటు పోలీసులు, ఇటు అధికారులు విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. కానీ, దేశవ్యాప్తంగా సోషల్ మీడియా నియంత్రణకు ఎలాంటి చట్టాలు, నిబంధనలు లేకపోవడంతో, ఫేక్ న్యూస్, ఫేక్ వీడియోలు సోషల్ మీడియాకు సంబంధించిన అన్ని ప్లాట్‌ఫామ్స్‌లోనూ హల్‌చల్ చేస్తున్నాయి.

## కమ్యూనిస్టు కార్యదీక్షకు దర్పణం
# కామ్రేడ్ ఈర్ల నరసింహ



17.5.2024 ప్రథమ వర్ధంతి

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ ఈర్ల నరసింహ మరణించి నేటికి సంవత్సరం. వారి జ్ఞాపకాలు, పోరాటాలు, పార్టీ పట్ల వారి కార్యదీక్ష పార్టీ క్యాడర్ మదిలో నేటికీ మెదులుతున్నాయి. అతి నిరుపేద కుటుంబంలో ఈర్ల నారాయణ, లక్ష్మమ్మ దంపతులకు మొదటి సంతానంగా నరసింహ జన్మించారు. వారు విద్యార్థి దశలో చదువు లో ముందుండేవారు. వారి ప్రాథమిక విద్య ఒకటి నుంచి ఐదు వరకు వెల్గొండ గ్రామంలో, అనంత రం వాగులు, వంకలు దాటుతూ కాలినడకన దాదాపు 7 కిలోమీటర్లు బిజినపల్లికి వెళ్లి ఆరు నుంచి 10 వరకు అక్కడ చదివారు. ఇంటర్ మహబూబ్‌నగర్‌లో, డిగ్రీ జడ్చర్లలో పూర్తి చేశాడు. డిగ్రీ చేస్తున్న కాలంలో ఆర్ఎస్ఎస్, జన సంఘం తో సంబంధాలు ఏర్పడ్డాయి, కానీ డిగ్రీ పూర్తి చేసుకొని గ్రామానికి వచ్చిన తర్వాత వారి గ్రామంలో వ్యవసాయ కూలీలపై, పేద రైతాంగంపై దొరల దోపిడి వారి పెత్తనం, ఆగడాలు ప్రత్యక్షంగా చూసి చలించిపోయాడు. అప్పుడే వారు పైచదువులకు పోకుండా పక్కకి పెట్టి, రెండు ప్రభుత్వ ఉద్యోగా లు వచ్చినా వాటిని వదులుకొని గ్రామ అభివృద్ధికై పనిచేయాలని నిర్ణయించుకున్నా డు.

కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి గారి మాటల్లో ఈర్ల నరసింహ గారి స్వగ్రామంలో కామ్రేడ్ లింగారెడ్డి గారి అక్కగారి కొడుకైన కామ్రేడ్ శ్రీనివాస్ రెడ్డి కమ్యూనిస్టు సభ పెడితే అట్టి సభకు ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ నల్లమల గిరి ప్రసాద్ గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆ సభలో పాల్గొన్న ఈర్ల నరసింహ పార్టీపట్ల ఆకర్షితులైనారు. అనంతరం వారు పాలేరులకు శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వకుండా వాళ్ల తో వెట్టి చేయించుకుంటున్న అక్కడి కమ్మ క్రిస్టియన్ భూస్వాములపై జీతగాళ్ల పక్షాన కన్నెరజేసి సమ్మెకు పిలుపునిచ్చి సమ్మెను విజయవంతం చేసి పాలేరుల జీతాలను పెంచిన నవయుగ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ ఈర్ల నరసింహ. అక్కడి పెత్తందారులు, సమ్మెను విజయవంతం చేసి పాలేరుల జీతాలు పెంచారనే నెపంతో నరసింహ పై ఎన్నో అక్రమ కేసులు బనాయించి భౌతికంగా వారిపై దాడులు చేశారు. వారితో పాటు ఆ గ్రామ కమ్యూనిస్టు నాయకులపై కూడా నిర్బంధాలు జరిగాయి, అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పార్టీ పటిష్టతకు కృషి చేశాడు, గ్రామ ప్రజల్లో కూడా వారి పట్ల విశ్వాసం పెరిగింది, గ్రామ ప్రజలందరూ వారి నాయకత్వాన్ని బలపరుస్తున్న సందర్భంలో గ్రామ పెత్తందారు రెడ్ల నుంచి కూడా ఎన్నో నిర్బంధాలు, ఆటుపోట్లు, భౌతిక దాడులు ఎదుర్కొన్నాడు కానీ వారికి లొంగకుండా అట్టి దాడులకు ఎదురొడ్డి, వారిపై పెట్టిన 40 అక్రమ క్రిమినల్ కేసులను ఎదుర్కొని, పక్క గ్రామలలో కూడ పార్టీ విస్తరణకు కృషి చేశాడు. అనంతరం వేరే మండలాలలో కూడా పార్టీ విస్తరణకు వారు కృషి చేశారు. నేను కూడా వారు నిర్వహించిన అనేక పోరాటాల్లో పాల్గొన్నాను, ప్రత్యేకించి రంగాపూర్ ఫారెస్ట్ భూపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాను. నా సూచన మేరకు నాగర్ కర్నూలులో ఉన్న జిల్లా పార్టీ ఆఫీసును మహబూబ్‌నగర్‌కు షిఫ్ట్ చేసి అక్కడ పాత భవనాన్ని ప్రజల కాంట్రిబ్యూషన్ తో కొనుక్కొని దాన్ని మరమ్మతులు చేసుకొని పార్టీ కార్యక్రమాలు అక్కడినుంచి నిర్వహించడం, ఇది వారి జిల్లా కార్యదర్శి హోదాలో పెద్ద విజయంగా భావించవచ్చు. వారు జిల్లా కేంద్రంగా చేసుకొని పార్టీ విస్తరణకు జిల్లాలో ముఖ్యమైన పాత్ర పోషించారు. వారు చాలాకాలం గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. వారి భార్య సరోజ కూడా నేటికీ ఎంపిటిసిగా ఉన్నారు. సర్పంచ్ కూడా సిపిఐ కైవసం చేసుకుంది.

కామ్రేడ్ నారాయణ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కాలంలో నరసింహ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా బాగా పనిచేశారు. జిల్లాలో పేరుందిన ప్రజానాయకుడు గా గుర్తింపు తెచ్చుకున్నారు. అనుకోకుండా గ్రామ ఉత్సవాల్లో నరసింహ పాల్గొన్న సందర్భంలో ఎద్దు తగిలి తలకు బలమైన గాయమై కోలుకోలేక 17.5.2023న మరణించడం అట్టడుగు వర్గాలకు, పార్టీకి తీవ్ర నష్టం కలిగించింది,

జిల్లా పార్టీ సెక్రటరీగా దాదాపు 17 సంవత్సరాలు పనిచేశారు, వారి హయాంలో పార్టీ ప్రజా సంఘాల విస్తరణ, నూతన కేడర్ను నమోదు, గ్రామాల్లో సైద్ధాంతిక రాజకీయ శిక్షణ కేంద్రాల ఏర్పాటు, కొత్త ప్రాంతాలకు పార్టీని విస్తరింప చేయడం వంటివి నిరంతరం జరిగాయి. పాలమూరు అంటే కరువు, ఆకలి చావులు, వలసలు. పెండింగ్ ప్రాజెక్టుల సాధనకై 1980 దశకంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో జరుగుతున్న జల దోపిడీకి వ్యతిరేకంగా, పాలమూరు జిల్లా నీటి వాటాకై ఎల్లూరు నుంచి మహబూబ్‌నగర్‌కు చలో పాదయాత్ర కార్యక్రమం చేపట్టి కలెక్టరేట్‌ను కామ్రేడ్లతో ముట్టడించారు. వైయస్ హయాంలో పాలమూరుకు వరదలు వస్తే రాష్ట్ర పార్టీ కార్యదర్శి నారాయణ గారిని తీసుకొచ్చి, జిల్లా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసి అక్కడి నిర్వాసితులను ఆదుకొని అండగా నిలిచారు. జిల్లాలో ఎన్నో భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచిన కమ్యూనిస్టు ఘనుడు.

జిల్లా కేంద్రంలో వారి హయాంలో నేను పట్టణ కార్యదర్శి గా పనిచేస్తున్న కాలంలో రంజాన్ మాసంలో ముస్లింలకు విందు ఏర్పాటు చేస్తే అక్కడ వారు హిందీ మాట్లాడడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. గొప్ప మనుషులలో కనిపించే అన్ని మంచి లక్షణాలు కామ్రేడ్ ఈర్ల నరసింహలో కనపడతా యి, ఆయనలో నిరాడంబరత, నిస్వార్థం, నిజాయితీ, త్యాగం, సైద్ధాంతిక ఆలోచన, పార్టీ పట్ల క్రమశిక్షణ, సమయపాలన, పారదర్శకత మొదలైన వాటికన్నా గొప్పగా ఆయన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంది, తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు ఎర్ర జెండాను ముద్దాడిన విప్లవ వీర కెరటం మన ఈర్ల నరసింహ.


బి పరమేశ్ గౌడ్
సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

## బిపిని నిర్లక్ష్యంచేస్తే ప్రాణాంతక వ్యాధులు!

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.13 బిలియన్లకు పైగా ప్రజలు అధిక రక్త పోటు (హైపర్‌టెన్షన్ లేదా బ్లడ్ ప్రెజర్) రుగ్మతతో బాధ పడుతున్నారని గమనించిన 'వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్' చొరవతో 2005లో ప్రారంభమై ప్రతి ఏటా 17 మే రోజున 'ప్రపంచ రక్త పోటు దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రపంచ రక్త పోటు దినం 2024 వేదికగా 'రక్త పోటును కొలుచుకో, నియంత్రించు, దీర్ఘకాలం జీవించు' అనే నినాదాన్ని తీసుకొని విస్తృత ప్రచారం చేయాలి. రక్త పోటు పెరగడానికి గల కారణాలు, నియంత్రణకు మార్గాలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించడానికి ఈ వేదికలను ఉపయోగిస్తారు.

**అల్పాదాయ దేశాల్లో సమస్య ఎక్కువ:** విశ్వవ్యాప్తంగా మూడింట రెండు వంతుల అల్ప, మధ్యస్థ ఆదాయ దేశాల ప్రజలు రక్త పోటుతో సతమతం అవుతున్నారు. దాదాపు 10 శాతం ప్రజలు బిపీ సమస్యతో బాధ పడుతున్నారని, 2025 నాటికి 25 శాతం ప్రజలకు బిపీ తగ్గించే/నియంత్రించే ప్రయత్నాలు చేస్తున్నామని ఐరాస అంటున్నది. ప్రపంచ బిపీ దినం సందర్భంగా ఉచిత రక్త పోటు నిర్ధారణ పరీక్షలు చేస్తూ, ఈ రుగ్మత పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టాలి. సాధారణంగా 140/90 వరకు బిపీ ఉన్నపుడు నియంత్రించ వచ్చు. ఆరోగ్యవంతుల బిపి 120/80 ఉండాలని మనకు తెలుసు. రక్త పోటు అధికమైనపుడు తీవ్ర గుండె సమస్యలతో కూడిన అనారోగ్యాలు కలుగుతాయి. ప్రపంచ మరణాల్లో 12.8 శాతం బిపీ సంబంధ సమస్యలతో జరిగినవే అని తేలింది.

**రక్తపోటు దుష్ప్రభావాలు:** ప్రపంచ రక్త పోటు దినం అవగాహన వేదికలు జనాలను భయపెట్టి, మానసిక ఒత్తిడి పెంచేవి కాదని, ఈ రోజున బిపీ సమస్యకు సంబంధించిన లోతైన విషయ పరిజ్ఞానం అందించడం జరుగుతుందని నమ్మాలి.




బిపీని నిర్లక్ష్యం చేసినపుడు గుండె పోటు, కిడ్నీ సమస్యలు, హార్ట్ ఫేయుల్యూర్, చూపు మందగించడం, స్ట్రోక్‌లు లాంటి ప్రాణాపాయ స్థితులు కూడా రావచ్చని తెలుసుకోవాలి. నేడు భారతదేశంలో మూడింట ఒక వంతు ప్రజలకు బిపీ సమస్య ఉందని, పురుషుల కన్న మహిళల్లో అధికంగా ఉండడం గమనించారు. పట్టణ ప్రజల్లో 40 శాతం వరకు, గ్రామీణుల్లో 17 శాతం వరకు నిర్ధారించబడింది. 2016 గణాంకాల ప్రకారం రక్త పోటు కారణంగా 1.63 మిలియన్ల మరణాలు నమోదైనాయని తేలిం ది. 18 25 మధ్య వయస్కుల్లో కూడా 10 శాతం మందికి బిపీ సమస్య ఉండడం విచారకరం. హృదయనాళ సంబంధ రుగ్మతగా బిపీని 'సైలెంట్ కిల్లర్'గా పిలుస్తారు. వయస్సు 60 దాటిన వయోజనులకు బిపీ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి. భారత్‌లో రక్త పోటు రుగ్మతతో 80 మిలియన్ల ప్రజలు, అనగా ప్రతి ఐదుగురిలో ఒక వయోజనుడు (19 శాతం) బిపీ రుగ్మతతో బాధ పడుతున్నాడు. వీరిలో 15 శాతం చికిత్స తీసుకోవడం, 49 శాతం నియంత్రించలేని బిపీ రోగులు ఉన్నారని తేలింది.

**రక్త పోటు కారణాలు/లక్షణాలు:** రక్త పోటుకు కారణాలుగా పొగాకు ఉత్పత్తుల వాడకం, మధుమేహం ఉండడం, కొలెస్ట్రాల్ అధికమవడం, స్థూలకాయం, లవణ అధిక వినియోగం, ఆల్కహాల్ సేవనం, అధిక మానసిక ఒత్తిడి, అనువంశిక కారణం లాంటివి చెప్పవచ్చు. అధిక బిపీకి లక్షణాలుగా తల నొప్పి, దృష్టి దోషం, శ్వాస మందగించడం, ముక్కుల నుండి రక్తం కారడం, ఫాటిగ్యు, న్యూసియా లాంటివి గమనించారు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు:**

బిపీని నియంత్రించడం, రాక ముందే జాగ్రత్తలు తీసుకుంటూ ఆకుకూరలు, బెర్రీస్, పాలు/పెరుగు, ఓట్‌మీల్, అరటి పండ్లు, చేపలు, టమాటో, గోధుమలు, జోన్నలు, గ్రీన్ పీస్, ఉల్లి, పొప్పడి పండు, ఉసిరి, మజ్జిగ, ఓట్స్ లాంటి ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవాలి. లవణం, చక్కర, జంక్ ఫుడ్, కొవ్వులను పూర్తిగా తగ్గించాలి. పొగాకు, ఆల్కహాల్, ఉప్పు వాడకాలను కూడా పూర్తిగా తగ్గించాలి. వ్యాయామం, నడక, యోగా, ధ్యానం, 6–7 గంటల నిద్ర ఉండాలి. ఇంటి భోజనాన్ని మాత్రమే తీసుకోవాలి. లిఫ్టుకు బదులు మెట్ల మార్గాన్ని ఆశ్రయించాలి.

ప్రతి ఏటా ఇండియాలో దాదాపు 10 మిలియన్ల మరణాలు బిపీ సంబంధ కారణాలతో జరుగుతున్నాయి. బిపీ అంటువ్యాధి కాదని, మన అలవాట్లతో నివారించడం, నియంత్రించడం చేయవచ్చని తెలుసుకోవాలి. బిపీ రాకుండా పరిపూర్ణమైన జీవనశైలిని పాటిస్తూ, రక్తపోటు సమస్య లేని భారతాన్ని నిర్మించుటలో మనందరం సహకరిద్దాం.

ఆరోగ్యం



## నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు

### తీన్మార్ మల్లన్నను గెలిపించాలి : ఎమ్మెల్యే జైవీర్

**ప్రజాపక్షం/హాలియా :** కాంగ్రెస్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న గెలిపించాలని సాగర్ ఎంఎల్ఏ కుందూరు జైవీర్ రెడ్డి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డిలు అన్నారు. గురువారం హాలియాలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నిరుద్యోగ యువత కోసం తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా భారీగా కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి కొండేటి మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, హాలియా మున్సిపల్ చైర్ పర్సన్ ఎడవెల్లి అనుపమ నరేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు మాల అరుణ, జడ్పిటిసి సభ్యుడు కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, ఎడవల్లి రంగసాయిరెడ్డి, హాలియా పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, గౌని రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పనిచేసే వాళ్లకే పట్టం కట్టండి

**ప్రజాపక్షం/చందంపేట :** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నిక ఈనెల 27న జరగనున్న తరుణంలో పని చేసే వాళ్లకే పట్టం కట్టాలని పిసిసి సభ్యులు, పిఎసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి పట్టభద్రులను కోరారు. గురువారం దేవరకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో లేనప్పుడు తీన్మార్ మల్లన్న ఎంతో మంది పేద ప్రజలకు విద్యార్థులకు న్యాయం చేయడం జరిగిందని, యువత పట్ల మల్లన్న చేసిన పోరాటాలు ఎనలేనివని అన్నారు. గతంలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి దొంగ ఓట్లతో గెలవడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ తరుపున తీన్మార్ మల్లన్న మరల మన ముందుకు వచ్చిన తరుణంలో పట్టభద్రులు ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.



## రైతుల సమస్యలు పరిష్కరించాలి

### మాజీ ఎమ్మెల్యే తిప్పన

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ పిలుపు మేరకు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తిప్పన విజయసింహారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసే పని పెట్టుకుందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్న రకం ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. తెలంగాణాలో 90శాతం మంది రైతులు దొడ్డురకం ధాన్యాన్నే పండిస్తారని, ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం ఇలాంటి ప్రకటన చేయడమేంటన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్నిరకాల వరి ధాన్యానికి బోనస్ రూ.500 ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్‌పిటిసి ఆంగోతు లలితహాతీరాం, నాయకులు పెండ్యాల పద్మ, అమరావతి సైదులు, చిట్టిబాబునాయక్, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మోసిన్‌అలీ, పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, వెలిశెట్టి రామకృష్ణ, అబ్దుల్ కరీం, పునాటి లక్ష్మీనారాయణ, తలకోన శ్రీధర్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్, చాంద్‌పాషా, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, పశ్యా శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌రాజు, గుడిసె దుర్గాప్రసాద్, గంటా శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, కోదాటి రమా తదితరులు పాల్గొన్నారు.



## ట్రాలీ ఆటో బోల్తా.. కూలీలకు తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం / అయిజ :** కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటన అయిజ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే అయిజ పట్టణంలోని వల్లూరు పేట, మ్యాకలపేటకు చెందిన సుమారు 30 మంది కూలీలు ఎల్లస్వామి అనే రైతు పొలానికి వెంకటేష్ ట్రాలీ ఆటోలో బయలు దేరారు ఈ క్రమంలో పొలానికి సమీపంలో గద్వాల రోడ్డు కట్టకింద తిమ్మప్ప స్వామి దగ్గర అదుపు తప్పి బోల్తా పడింది ఈ ప్రమాదంలో సుమారు 8 నుండి 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది వీరిని స్థానికులు సమీపంలోని బ్రహ్మారెడ్డి ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. తీవ్రగాయాలు అయినటువంటి వారిని మాస్టర్ శెక్షావలి అంబులెన్స్‌ను పిలిపించి కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై కూలీలు ఎక్కువ మంది ఆటోలో ఎక్కడం ఒక కారణం మరియు ఆటో డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమై పల్టీలు కొడుతూ చాలా దూరం ఈడ్చుకొని వెళ్ళిందని బోరునవిలపించారు. ఈ విషయపై పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు.దీనిపై దర్యాప్తు చేపట్టారు.



## గుడిసెలు తొలగింపు అన్యాయం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించడం అన్యాయమని బాధితులు గురువారం విలేకర్లతో అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రం 20వ వార్డు జమ్మిగడ్డ పుల్లారెడ్డి చెరువు శిఖం భూమిలో గత కొన్ని ఏళ్లుగా ఇండ్ల కోసం పోరాటం చేస్తున్నట్లు వారు తెలిపారు. డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇస్తానని చెప్పి గత ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఊరికి వెళ్లింది చూసి అధికారులు గుడిసెలను తొలగించారని పేర్కొన్నారు. కూలీనాలి చేసుకుని బతుకులు గడుపుతున్న బైండ్ల కులస్తులు వేల డబ్బులతో పుల్లారెడ్డి చెరువు శిఖం భూమిలో నిర్మాణం చేసుకున్న గుడిసెలను చెప్పకుండా నేలమట్టం చేయడంతో ఆవేదన వ్యక్తం చేశారు. కిరాయి ఇండల్లో ఉండలేని పరిస్థితిలో పేదలు 15 కుటుంబాలు ఇటువంటి నిర్ణయం తీసుకుని ముందుకు వెళ్లినట్లు వారు తెలిపారు. మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి వద్దకు వెళ్లి కూడా మొరపెట్టుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలు వేసుకునే గుడిసెలకు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో రవి, నాగరాజు, శివ, వెంకన్న, జనార్ధన్, రాము, అఖిల్, కీర్తి, జ్యోతి, విజయలక్ష్మి, నాగమణి, చంద్రకళ పాల్గొన్నారు.

# ఎన్నికలు, గ్రూప్–1లకు పటిష్ట ఏర్పాట్లు

### ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలు

### ఫ్లైయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ కొనసాగించాలి

### సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్




**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్ :** ఈ నెల 27న జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎన్నికకు, జూన్ 9న జరిగే గ్రూప్ 1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, తహసీల్దార్‌లు, ఆర్డీవోలు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్ లోకల్‌బాడీ సిహెచ్ ప్రియాంకతో కలసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. శాసనమండలి ఎన్నికలకు 52 మంది అభ్యర్థులు బరిలో ఉద్నరని, పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు 142 జంబో బ్యాలెట్ బాక్సులు శ్రీ సత్యసాయి జిల్లా నుండి తెప్పించడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకుగాను సూర్యాపేటలో 31 పోలింగ్ కేంద్రాలు,కోదాడలో 22 పోలింగ్ కేంద్రాలు, హుజూర్‌నగర్‌లో 18 పోలింగ్ కేంద్రాలు మొత్తం 71 పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 51,947 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. ఎఫ్ఎస్‌టి ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లచే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 9న జరిగే గ్రూప్ 1 పరీక్షలకు జిల్లాలో 40 సెంటర్‌లలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. 9744 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని కలెక్టర్ తెలిపారు. వీరికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ జిల్లాలో జరిగే గ్రూప్ 1 పరీక్షలకు అన్ని కేంద్రాలలో బందోబస్తుకు పోలీస్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్స్ అనుమతిలేదని, అన్ని కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టీసీ, విద్యుత్ శాఖ, రోడ్ల భవనాలశాఖలు తమ పూర్తి సహకారం అందించాలన్నారు. పట్టభద్రుల ఎన్నికలలో ఎఫ్ఎస్‌టిలు పనిచేస్తాయని ఈ ఎన్నికలకు జిల్లా ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాన్‌పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి వివి అప్పారావు, బ్యాలెట్ సక్సెస్ నోడల్ అధికారి డిపివో సురేష్‌కుమార్, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, మత్స్యశాఖ అధికారి రూపేందర్ సింగ్, వెహికల్,ట్రాన్స్‌పోర్ట్ నోడల్ అధికారి ఆర్డీవో సురేష్‌రెడ్డి, ఎంసిసి నోడల్ అధికారి డిఎఫ్‌వో సతీష్‌కుమార్, ఎక్స్పెంచర్ మానిటరింగ్ నోడల్ అధికారి ఎస్.పద్మ, ఎంసిఎంసి నోడల్ అదిఆరి డిపిఆర్‌వో ఏ.రమేష్‌కుమార్, ఎలక్ట్రోరోల్స్ మోడల్ అధికారి శ్యాం సుందర్‌ప్రసాద్,అబ్జర్వేషన్ మోడల్ అధికారి లక్ష్మణనాయక్,పిడబ్ల్యూడి నోడల్ అధికారి వెంకటరమణ, మాస్టర్ ట్రైనర్స్ వి. రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఎన్నికల సూపరిండెంట్ శ్రీనివాసరాజు, వేణు, రమేష్, గ్రూప్ 1 పరీక్షల సూపరిండెంట్ పద్మారావు, కలెక్టరేట్ ఏవో మందడి సుదర్శన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టుదలతో పనిచేస్తే విజయం మనదే

### ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** ఉద్యోగులు, యువతను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని, మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనే కృతనిశ్చయంతో యువత, ఉద్యోగులు ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ, వరంగల్,ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సూర్యాపేట జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన జిల్లా ముఖ్య నేతలతో గురువారం సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన విధి విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయానికి కావాలసిన సానుకూల వాతావరణం నియోజక వర్గంలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సిద్ధంగా ఉన్న ప్రతి ఓటరు కలవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల తరహాలో వారం రోజులు బిఆర్ఎస్ శ్రేణులు ప్రజాక్షేత్రంలో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.మన పని విధానమే మన విజయానికి నాంది అని తెలిపారు. సిట్టింగ్ స్థానాన్ని బిఆర్ఎస్ నిలబెట్టుకోవడం ఖాయమన్నారు.

## పొలంలో వ్యర్థాలు తగులబెట్టొద్దు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** పవర్ గ్రిడ్ కార్పొరేష్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవి విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగులబెట్టవద్దని పవర్ గ్రిడ్ కార్పోరేషన్ చీఫ్ మేనేజర్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. విద్యుత్ లైన్ల కింద పంటలు పండించే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చివేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. మానకొండూర్ మండలంలోని అన్నారం, చెంగర్ల, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, లలితాపూర్, ముంజుంపల్లి, పచ్చునూరు, వేగురుపల్లి, వెల్ది గ్రామాలు, చిగురుమామిడి మండలంలోని చిగురుమామిడి, ఇందుర్తి, ముదిమాణిక్యం, ముల్కనూర్, నవాబుపేట, పీచుపల్లి, సుందరగిరి గ్రామాలు, తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి, పోరండ్ల గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల కింద పంట సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద మంటలు పెడితే కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, సమీపంలోని జంతువులు, మానవులకు హాని జరిగే ప్రమాదం ఉందంటున్నారు. రైతులు గమనించి ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టవద్దని కోరారు.

## జపాన్ పర్యటనకు అల్ఫోర్స్ విద్యార్థిని




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ గ్రూప్ స్కూల్స్‌కు చెందిన ఎం. పూజశ్రీ జపాన్‌లోని సకుర పర్యటనకు అవకాశం పొందింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ప్రపంచ ప్రమాణాలకు ధీటుగా అపూర్వ అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే చాలా అత్యుత్తమ విషయాలు బోధించడం జరుగుతుందని చెప్పారు. అందుకు అనుగుణంగా చాలా అద్భుతమైన ఫలితాలు సాధించడం జరుగుతుందని చెప్పారు. అద్భుతమైన విజయాలలో భాగంగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్ట్స్ విద్యార్థిని ఎం.పూజశ్రీ జాతీయ స్థాయి ఇన్స్పైర్ అవార్డు తను ప్రదర్శించిన వీల్ ఆక్సిల్ కెమెరా ఆకట్టుకున్నదని, సృజనాత్మకంగా తయారు చేయబడినదని న్యాయనిర్ణేతలు తెలిపారని చెప్పారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను జపాన్‌లోని సకురలో పాల్గొనే అవకాశం పొందిందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని రూపొందించిన నమూనా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరిశీలించి అభినందించడం జరిగిందన్నారు. భారతదేశం తరపున మే 19 నుంచి 25వరకు సకురలో పలువురు ఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తల ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రదర్శన ఇవ్వబోతున్నదని, ఇంతటి ప్రతిష్టాత్మక అవకాశాన్ని పొందిన తెలంగాణ నుంచి రెండో విద్యార్థిని అని చెప్పారు. విద్యార్థిని ఎంపిక పట్ల పెద్దపల్లి డిఇవో మాధవరి, డిఎస్‌వో రవినందర్‌రావు, పలువురు సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు. పర్యటనకు బయలుదేరే విద్యార్థినికి పుష్పగుచ్చాని అందజేసి విదేశాలలో సైతం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన

### శాస్త్రవేత్తలు, అధికారులకు కలెక్టర్ సూచన



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** వ్యవసాయ రంగంలో రోజురోజుకూ వస్తున్న అధునాతన పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అధిక దిగుబడులు, మంచి లాభాలు సాధించేలా వారికి తర్ఫీదు ఇవ్వాలని పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి వచ్చిన టార్చ్‌ను గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులకు అందజేశారు. ఈ సంధర్బంగా వారిని అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు ప్రారంభమై 50 సంవత్సరాలు గడిచిందని పేర్కొన్నారు. ఈ మేరకు స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీ నుంచి వచ్చిన టార్చ్‌ను అధికారులు పరిశీలన కోసం వివిధ జిల్లాలకు తీసుకెళ్తున్నారని తెలిపారు. శాస్త్రవేత్తలు, అధికారులు సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. ఈ పద్ధతి వల్ల కలిగే లాభాలను వివరించాలని పేర్కొన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగులో సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. వారి ఆర్థిక అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని, రైతులకు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. రైతులకు పంటల సాగులో ఏ ఇబ్బంది వచ్చినా వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, కెవికె ప్రధాన కార్యదర్శి విజయగోపాల్ రెడ్డి, కెవికె సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, ఏడిఏ రణధీర్ రెడ్డి, శాస్త్రవేత్తలు ప్రభాకర్, ప్రశాంతి, విజయ్, వేణుగోపాల్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



## సబ్సిడీపై జీలుగ విత్తనాలు

### డిఏఓ అనురాధ వెల్లడి

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** రైతులకు జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నామని రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ చెప్పారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్ట అందిస్తుందని తెలిపారు. తొలకరి వర్షాలు పడిన వెంటనే వరి వేసుకునే నెలలో రెండున్నర ఎకరాలకు 30 కిలోల చొప్పున ఎకరానికి 12 కిలోలు విత్తనాలను నేల లో వెదజల్లాలని, 25 నుండి 30 రోజులకు పంట పూతదశకు వస్తుందని వివరించారు.నాటు వేసుకునే ముందు ఈ పచ్చి రొట్ట పైరును భూమిలో కలియదున్నాలని, పచ్చి రొట్ట పైరు వేసుకోవడం వలన భూసారం బాగా పెరుగుతుందని, చవుడు నేలల్లో వేసినట్లయితే చౌడు తగ్గిపోతుందని, ఒక ఎకరానికి 10 టన్నుల పశువుల పెంట పోసినంత బలం భూమికి లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా జీలుగ విత్తనాల 30 కిలోల సంచికి రూ.2,790 ఉంటుందని దీనిలో సబ్సిడీ రూ.1,674 పోను మిగతా రూ.1,116 రైతు చెల్లించవలసి ఉంటుందని అన్నారు. ఇక జనుము 40 కిలోల సంచి మొత్తం ధర రూ.3,620 ఉంటుందని అందులో సబ్సిడీ రూ.2,172 పోను రూ.1,448 రైతు చెల్లించి కొనుగోలు చేయాలని సూచించారు. అంతేకాకుండా పిల్లిపెసర 20 కిలోల సంచి రూ.2,710 ఉండగా సబ్సిడీ రూ.1,626 పోను మిగతా రూ.1,084 రైతు చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. ఈ విత్తనాలు జిల్లాలోని అన్ని కోఆపరేటివ్ సొసైటీలలో లభిస్తాయని, రైతులందరూ పచ్చిరొట్ట విత్తనాలను తమ పొలాలలో వరి వేయి పొలంలో తప్పకుండా వేసుకోవాలని ఈసందర్భంగా రైతులకు సూచించారు.

## బ్యాంక్‌లోన్ ఇస్తామని డబ్బులు కాజేసిన చేసిన సైబర్ నేరగాళ్ళు



**ప్రజాపక్షం/రాజోలి :** సైబర్ మోసాలపై ఎన్నోమార్లు పోలీసు శాఖ, ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని చెప్పిన ఏదో ఒక చోట ప్రజలు మోసపోతూనే ఉంటారు. అలస్యంగా వెలుగులోకి వచ్చిన ఓ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అలంపూర్ తాలూకాలోని రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన జీవరత్నంకు కొద్ది రోజుల క్రితం బ్యాంకు నుండి మాట్లాడుతున్నామని సైబర్ నేరస్తుడు ఫోన్ చేశాడు. బ్యాంకు టెక్నికల్ బృందం మాట్లాడుతున్నాము లైన్లో ఉండండి అంటూ చెప్పడంతో బ్యాంకు వారే ఫోన్ చేస్తున్నారు అని నమ్మాడు బాంకు నుండి మీకు 4 లక్షలు లోన్ ఇస్తాము అంటూ మా ఖాతా బుక్, పాన్‌కార్డు,మీ ఫోటో,ఆధార్ కార్డు వాట్సాప్‌కి పంపండి అంటూ చెప్పడంతో మాయ మాటలు నమ్మి అన్నీ డాక్యుమెంట్లు పంపించాడు 10 రోజులుగా సుమారు 55వేల 550 రూపాయలు ఫోన్‌పే ద్వారా పంపించాడు. మరోసారి రూ.15 వేలు కావాలంటూ పలుమార్లు డిమాండ్ చేయడంతో తాను మోసపోయానని తెలుసుకున్న ఆయన ఈ నెల 14న సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై వ్యక్తిగత వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని ఫోన్‌లలో ఓటిపి, పెటియం, గూగుల్ పే, ఫోన్‌పే, ఇకెవైసి, అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు వెంటనే డయల్ చేయాలని రాజోలి ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.



## రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వం

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ, డిసెంబర్ 9న రుణమాఫీ అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినప్పటికీ ఇప్పటికీ దిక్కులేదన్నారు. రైతుబంధు, రైతు భరోసా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. చత్తీస్‌ఘడ్ తరహాలో ఎకరాకు 500 బోనస్ ఇస్తామని రైతులకు ఎన్నికల్లో హామీ ఇచ్చి విస్మరించారన్నారు. బోనస్ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. క్వింటాలు వడ్లకు రూ.2200 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌ను బేషరతుగా అందించాలన్నారు. ప్రభుత్వం ప్రతి రైతుకు ఓపిఎంఎస్ ద్వారా బోనస్ ఇవ్వాలన్నారు. రైతు ప్రభుత్వమని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన వాటిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలన్నారు. బోనస్ విషయంలో ప్రభుత్వం పునరాలోచించకపోతే రైతుల పక్షాన ఉద్యమాలు తప్పవన్నారు. మేయర్ సునీల్ రావు, బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులున్నారు.



## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించకపోవడంతో రోడ్లపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్యలు మాట్లాడుతూ మండలంలో 26 కేంద్రాల్లో ధాన్యం రాశులు పోసి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో రోజుల తరబడి రైతులు పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తి రంగు మారడంతో రైస్ మిల్లులు కొనడం లేదన్నారు. రామన్నపేటలో రైస్ మిల్లుల పరిమితి పూర్తికావడంతో లారీల కొరత ఏర్పడి రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద కాపలా కాయాల్సి వస్తుందన్నారు. పట్టాల కిరాయి పెరిగి ఆర్థిక భారం మోయాల్సి వస్తుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ముందు వేలాది మందితో ధర్నా నిర్వహిస్తామన్నారు. రైతులు చేస్తున్న ధర్నా వద్దకు స్థానిక తహసీల్దార్ లాల్ బహదూర్, ఎపిఓ, పిఎసిఎస్, సిఇఒ వచ్చి సంబంధిత అధికారులతో మాట్లాడి నాలుగు రోజుల్లో కొనుగోలు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్ర, రవీందర్‌రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు గన్నెబోయిన విజయభాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance

**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS25T 2024 | SUDHAKAR BOTLA | TATA ACE MEGA | 2017 |
| 2 | AP36TA 0692 | CHIRANJEEVI BOJJA | TATA ACE | 2011 |
| 3 | TS27F 3440 | RAMESH VASAM | EICHER 380 | 2021 |
| 4 | TS07UB 8429 | SAMBARAJU BANDARI | MARUTHI DZIRE TOUR DIESEL-P | 2016 |

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED,
H.No :15-1-237, Shop No.1, 2 & 3, 2nd Floor, Warangal City Center,
Opp : L B College, Mulugu Road , Cell : 9959090723

## అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన గెరిగంటి ఎల్లయ్య, వయస్సు 45 సంవత్సరాలు అను వ్యక్తి వ్యవసాయ పెట్టుబడుల గురించి తెలిసిన వారి వద్ద సుమారు 4 లక్షల రూపాయలు అప్పుచేసి వ్యవసాయం చేస్తున్నాడు. వరి పంట సరిగా పండక పోవడంతో అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ముందర గల వేప చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడం జరిగింది. ఈ విషయంపై అతని భార్య అగు వరలక్ష్మి గురువారం రోజున స్థానిక పోలీసులకు ఫిర్యాదు ఇవ్వగా నిజాంపేట్ పియస్ ఎస్‌హెచ్‌ఓ కేసు దర్యాప్తు ప్రారంభించారు.

## పిడుగుపాటుకు రైతు మృతి



ప్రజాపక్షం/తంగళ్ళపల్లి : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం ఇందిరా నగర్ గ్రామం లోని, భరత్ నగర్‌కు చెందిన ఓ రైతు వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా పిడుగు పడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో స్థానికులు వెల్లడించిన ప్రకారం భరత్ నగర్ కు చెందిన రుద్రారపు చంద్రయ్య అనే రైతు పొలం వద్ద పొలం పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో, కూడిన వర్షం పడడంతో అక్కడే పొలంలో పనులు చేస్తున్న చంద్రయ్య అనే రైతుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని తెలిపారు. వెంటనే స్థానికులు మృతదేహాన్ని అతని ఇంటి వద్దకు తీసుకువచ్చారు. మృతుడికి భార్య కళావతి, నలుగురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నాడు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## జైనూర్‌లో కొనసాగుతున్న 144 సెక్షన్



ప్రజాపక్షం/ జైనూర్ : కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల నేపథ్యంలో పోలీసులు విధించిన 144 సెక్షన్ గురువారం మూడో రోజుకు చేరుకుంది. జైనూర్ మండల కేంద్రంలో శాంతిభద్రతల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు చేపడుతున్నారు. వ్యాపారులు మూడో రోజు సైతం సంపూర్ణ బంద్ నిర్వహించి శాంతి భద్రతలకు సహకరిస్తున్నారు.

## బియ్యం డెలివరీ వేగవంతం



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లాలో 2022/23 సీజన్ బియ్యం డెలివరీ, రబీకి సంబంధించి టెండర్ అయిన ధాన్యం అప్పగింతలు త్వరగా చేయాలని రైస్ మిల్ యజమానులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న వేంకటేశ్వర రైస్ మిల్ ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా లో ఉన్న మిల్లర్లు బియ్యం డెలివరీ వేగవంతం చేసి త్వరగ వానాకాలం ధాన్యం బియ్యం అప్పగించాలని, టెండర్ పూర్తి అయిన యాసంగి రభి 2022/23 ధాన్యం వెనువెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. బియ్యం డెలివరీలో జిల్లాలను ముందు వరుసలో నిలపాలని, రోజు వారి బియ్యం పంపిణీపై సమీక్ష చేసి రోజు వారి నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు జిల్లా మేనేజర్ హరికృష్ణ ,సివిల్ సప్లై కార్పోరేషన్ సిబ్బంది ఉన్నారు.

## భూ సేకరణ పనులు వేగవంతం



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల ప్రతినిధి: కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణానికి భూ సేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలనికలెక్టర్అనురాగ్ జయంతి ఆదేశించారు. భూ సేకరణ పనులు, ఇతర అంశాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణానికి జిల్లాలోని వేములవాడ నియోజకవర్గం పరిధిలోని వేములవాడ, అనుపురం, కొడుముంజ, నాంపల్లిలో ఇంకా భూ సేకరణ చేయాల్సి ఉందని వివరించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎఫ్ఓ బాలామణి, రైల్వే శాఖ సీఈ, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఏడీ సర్వే శ్రీనివాస్, ఆర్ అండ్ బీ, ఉద్యానవన ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'పట్టభద్రుల' ఉప ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధం



ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: వరంగల్ ఖమ్మం నల్గొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వాహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం హైదరాబాద్ నుండి వరంగల్ఖమ్మంనల్గొండ శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహణ ప్రక్రియపై వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఈనెల 27న జరుగనున్న వరంగల్ ఖమ్మం నల్గొండపట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికకు జంబో బ్యాలెట్ బాక్స్‌లు, అదను బాలెట్ బాక్స్‌లు సిద్ధం చేయాలని తెలిపారు. బాలెట్ బాక్స్‌లకు యూనిక్ నెంబర్లు వేయాలన్నారు.వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలోని 59 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 65 జంబో బాక్స్‌లు, 48 పెద్ద బాక్స్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

## నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిశీలన



ప్రజాపక్షం/నందికొండః ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను గురువారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ నాగార్జునసాగర్ ను సందర్శించారు. ఆయనకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆ తర్వాత ప్రాజెక్ట్ అధికారులు వీరికి నాగార్జునసాగర్ మోడల్ డ్యామ్ కు సంబంధించిన విశేషాలను,నాగార్జున సాగర్ ప్రాజెక్టు యొక్క విశిష్టతను, దాని పని తీరును తెలియజేశారు. అదేవిధంగా ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణా సంబసరిహద్దు వివరాలను,ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థం, ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు పని చేసే విధానాన్ని, విద్యుత్ ఉత్పత్తి గురించి వివరించారు. వీరితో పాటు ప్రాజెక్టు ఎస్ ఈ నాగేశ్వరరావు,ఎస్ పి ఎఫ్ ఆర్ ఐ భాస్కర్ రెడ్డి,ఏఈ లు కృష్ణయ్య, సత్యనారాయణ, బిక్షపతి లు ఉన్నారు.

# శ్రీచైతన్యపై స్పందించరేమి?

**అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలి**

**విద్యాశాఖ అండతోనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి**



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కరీంనగర్ నగరంలో అనుమతి రాకముందే కార్పోరేట్ శ్రీ చైతన్య పాఠశాల వారు ముందస్తు అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా వారికి వత్తాసు పలుకుతున్నారని, అనుమతి లేదని చెబుతున్నా అధికారులు వచ్చి ఎందుకు సీజ్ చేయకుండా శ్రీ చైతన్య పాఠశాల వారివత్తాసు పలుకుతున్నారని, కరీంనగర్ జిల్లాలో డీఈవో అండదండలతోనే ప్రైవేట్ పాఠశాల వారు విద్యా వ్యాపారం చేస్తున్నారని జిల్లా డీఈవోను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ లోని జ్యోతిరావుపూలే గ్రౌండ్ వెనుక అనుమతి లేకుండానే అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలని డీఈఓ, ఎంఈవోలకు సమాచారం ఇచ్చినప్పటికీ రాలేదని, చివరకు ఏఐఎస్ఎఫ్ నాయకులే పాఠశాల సిబ్బందిని బయటకి సిబ్బందితో పంపించి గేట్ కు తాళం వేయడం జరిగిందన్నారు. మణికంఠరెడ్డి మాట్లాడుతూ శ్రీచైతన్య పాఠశాల వారు అనుమతులు రాకముందే ప్రచారం ,అడ్మిషన్లు నిర్వహిస్తూ ఆ భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్న విద్యాశాల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. గురువారం అక్కడ ధర్నా చేస్తున్నామని, సీజ్ చేయాలని చెప్పిన రాకుండా వారికి వత్తాసు పలికారన్నారు. శ్రీ చైతన్య పాఠశాలల వారు నగరంలో , నగర పాఠశాలలు నిర్వహిస్తున్నారని, కరీంనగర్ జిల్లాలలో , నగరంలో ప్రైవేట్ పాఠశాలలు వారు విద్యా వ్యాపారం చేస్తూ అక్షరాఅలతో లక్షల రూపాయల దోపిడీ చేస్తున్నారన్నారు. కరీంనగర్ జిల్లాలో బిటెక్ ఫీజుల కంటే ఎల్‌కేజీ ఫీజులే ఎక్కువగా ఉన్నాయన్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో అయిదు వేల నుంచి రూ.20వేలవరకువసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈటెక్నో, ఒలంపియాడ్,వరల్డ్ అని హోర్డింగ్స్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నా ఎందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని , ఇప్పటికే అనేక పాఠశాలల ఆవరణలోనే వచ్చే విద్యాసంవత్సరం పాఠ్యాపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నారని, ఫీజుల నియంత్రణ లేదని మౌలిక వసతుల కల్పనలేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులే వత్తాసు పలుకుతూ వారికి అండగా నిలుస్తున్నా కరీంనగర్ జిల్లా డీఈవోను సస్పెండ్ చేయాలని , వెంటనే కరీంనగర్ నగరంలోనిబంధన విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న, ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో డీఈవో చాంబర్ ముట్టడిస్తామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నునావత్ శ్రీనివాస్ నాయక్, నగర నాయకులు సందీప్ రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రావణ్ తదితరులున్నారు.

## బిజెపి ప్రభుత్వం చేసిందేమీలేదు



**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్**

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః దేశంలోని పేద,మధ్యతరగతి ప్రజలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిందేమీలేదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు.గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు ఎవరి పైసలతో వారే బ్యాంకు అకౌంట్ తెరిస్తే దాని పేరు జన్‌ధన్ అని, ఎవరి ఇల్లు వారే ఊడ్చుకుంటే స్వచ్ఛభారత్ అని, ఎవరి పిల్లలను వారే పెంచుకుంటే బేటీ బచావో బేటీ పడావో అని పిల్లల కోసం అకౌంట్లో పైసలు దాస్తే సుకన్య సమృద్ధి యోజన అని ఈ పథకాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. యువతను నష్టపరిచేలా దేశంలో ఐదుకోట్ల ఉద్యోగాలు పోయాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలోని అన్ని సంస్థలను వశపర్చుకుని ప్రతిపక్ష పార్టీలను ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. బిజెపి పాలకులు దేశం సెక్యూలర్ దేశమన్న విషయాన్ని మర్చిపోయారన్నారు. రాబోవు కాలంలో ప్రజలు మతాన్ని పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టే నాయకులను ఎన్నుకోబోతున్నారన్నారు. బిజెపికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

**సిపిఐ నాయకుల పరామర్శ**

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాష్ట్ర కౌలు రైతు సంఘం కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరీ, పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నంద్యాల రాంరెడ్డిలు పరామర్శించారు.

## 'యార్లగడ్డ' విగ్రహాన్ని ఆవిష్కరించిన కూనంనేని





ప్రజాపక్షం/ దమ్మపేట: భారత కమ్యూనిస్టు జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు యార్లగడ్డ భాస్కర్‌రావు మృతి ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. అనేక ప్రజా ఉద్యమాలకు దమ్మపేటలో యార్లగడ్డ నేతృత్వం వహించారన్నారు. ఇటీవల మృతి చెందిన యార్లగడ్డ భాస్కర్‌రావు విగ్రహాన్ని కూనంనేని ఆవిష్కరించగా స్మారక స్తూపాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించారు.కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి భాస్కర్‌కృషిచేశారన్నారు.మారుతున్నసామాజిక,ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా,నాయకునిగా పనిచేసిన భాస్కర్‌రావు ధన్యజీవి అన్నారు. రాజకీయాలలో ఆర్థిక వ్యవహారాలుపెచ్చుమీరిన నేటి రోజుల్లో ఎర్ర జెండా నీడన పని చేయడం గొప్ప విషయమన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజాఉద్యమాలతీరు మారాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోఫాసిస్టు సర్కార్‌కు వ్యతిరేకంగాగ్రామస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్మించబడాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, సయ్యద్ సలీం, రేసు ఎల్లయ్య, సుబ్బారెడ్డి, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) నాయకులు పాల్గొన్నారు.

## అశ్రునయనాల మధ్య రాయల అంత్యక్రియలు





ప్రజాపక్షం/ తల్లాడ : అశ్రునయనాల మధ్య దివంగత బిఆర్ఎస్ నేత, మాజీ ఎంపిపి,డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామంలో జరిగాయి. హైదరాబాద్‌లో బుధవారం మరణించిన శేషగిరి పార్థివ దేహాన్ని తల్లాడ మండలం మిట్టపల్లికి తరలించారు.వేలాది మంది అభిమానులు,బిఆర్ఎస్ కార్యకర్తలు, జిల్లా లోనిప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన వారు నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం ఎంపి నామ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు,శాసనమండలిసభ్యులు తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు, సండ్ర వెంకట వీరయ్య, సిపిఐ రాష్ట కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిధ పార్టీల నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి, ఎంపిపి దొడ్డా శ్రీనివాస్, దుగ్గిదేవర వెంకట్‌లాల్, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దివ్వెల కృష్ణయ్య, సుధాకర్, రామలింగేశ్వరరావు, రాయల రాము, బిజెపి నాయకులు తాండ్ర వినోద్‌రావు నివాళులర్పించారు. రాయల శేషగిరి విద్యావంతుడిగా, బాహుబాషా కోవిధునిగా పేరొందారు. కాంగ్రెస్‌తో ప్రారంభమైన ఆయన రాజకీయ జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. 46 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంపిపిగా, సొసైటీ ఛైర్మన్‌గా,డిసిఎంఎస్ అధ్యక్షునిగా పని చేశారు. 1982లో ఎన్‌టిఆర్ పిలుపు మేరకు టిడిపిలో చేరిన ఆయన తల్లాడ మండల అధ్యక్షునిగా పనిచేశారు. 1987 ఎన్నికల్లో తల్లాడ మండల పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1995 నుంచి పలు మార్లు గంగదేవి పాడు సొసైటీ ఛైర్మన్‌గా ఎన్నికై డిసిసిబి డైరెక్టర్‌గా పనిచేశారు. 2018 లో టిడిపి నుంచి బిఆర్ఎస్‌లో చేరారు. ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడే రాయల శేషగిరి ఎన్‌టి రామారావు, చంద్రబాబు నాయుడు, కేసిఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉండేవి. సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. గవర్నర్లుగా పనిచేసిన పలువురితోను పరిచయాలు ఉండేవి. రాయల మృతితో తల్లాడ మండలం ఒక అనుభవం కలిగిన రాజకీయ నాయకున్ని కోల్పోయింది.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**అధికారులకు జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ దిశానిర్దేశనం**



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా కాంటాలు వేసి పంపించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సైతం అక్కడే నిల్వ ఉండకుండా వెంట వెంటనే తరలించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ఎవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ఓపిఎంఎస్‌లో ఎప్పటికి అప్పుడు రైతుల ధాన్యం వివరాలు నమోదు చేయాలని, ఎటువంటి అలసత్వం వహించకుండా కొనుగోళ్లు జరపాలన్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచడంతో పాటు రైతులకు కావల్సిన సహాయ, సదుపాయాలు కల్పించాలన్నారు. వెనువెంటనే కొనుగోలు చేయడం వలన రైతులు సైతులు కొనుగోలు కేంద్రానికి రావడం తగ్గుతుందన్నారు. డిసిఎస్ఓ రోజారాణి,డిఎంసిఎస్‌ప్రసాద్ పాల్గొన్నారు.

**25 నాటికి అమ్మ ఆదర్శపాఠశాల పనులు పూర్తి చేయాలి**

ఈ నెల 25 నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో స్థానిక అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలలపై సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల పనులు, ఈజిఎస్, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులక యూనిఫాం పనులు పూర్తి చేయాలనిన్నారు. జిల్లాలో 263 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ద్వారా పనులు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు గుర్తించిన పనులను వేగం పూర్తి చేయాల్సిన అవసరం ఉందనానరు. పెండింగ్‌లో ఉన్న పనుల్ని పూర్తి చేస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. టాయిలెట్స్, తాగునీరు, విద్యుత్, గేట్లు, ప్రహారి గోడ నిర్మాణం తదితర మౌలిక వసతులు పూర్తి చేయాలని ఆదేశించారు.పనులపై మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. విద్యార్థుల యూన్‌ఫాం కుట్టు పనులు జూన్ 5లోపు పూర్తిచేయాలన్నారు. ఉపాధి పనుల్ని వేగవంతం చేయాలని, పని ధినాలు 200 రోజులకు పెంచాలని ఇందులో స్పెషల్ అధికారులు కీలక పాత్ర పోషించాలన్నారు. అంగన్వాడీల్లో పోషకాహారంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి బుధవారం పంచాయితీ కార్యదర్శులు అంగన్‌వాడీ కేంద్రాన్ని పర్యవేక్షించాలన్నారు. మండల స్పెషల్ అధికారులు, జడ్‌పి సిఈఓ అనిల్‌కుమార్, డిఈఓ రాముల, డిఏఓ వినోద్‌కుమార్, బిసి వెల్ఫేర్ అధికారి రవీందర్,ఉద్యానవన శాఖ అధికారి కేఆర్ లత, డిఎంఓ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో సిపిఐలో చేరికల పరంపర



ప్రజాపక్షం/కొత్తగూడెం: సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం రామాంజనేయ కాలనీ నుండి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సిపిఐలో కొందరు చేరారు. భాషీర్, యాకూబ్, జహేద్, యాకూబ్ కాన్, మాగ్బుల్, షరీఫ్, వారితో పాటు 20 కుటుంబాలు చేరారు. కొత్తగూడెం నియోజవర్గ అభివృద్ధి కోసం శాసన సభ్యులు చేస్తున్న కృషికి ఆయనకు తోడుగా నిలవాలనే ఉద్దేశ్యంతో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా సారధ్యంలో చేరారు.ఈ సందర్భంగా వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వాసిరెడ్డి మురళి,భూక్యా ధస్రు, సిపిఐ వార్డు కౌన్సిలర్ యూసుఫ్,లింగేశ్ తదితరులు ఉన్నారు

## పచ్చిమిర్చి ధర పైపైకి..

(మొదటి పేజీ తరువాయి)

రూ.50 నుండి రూ.60 వరకు పలికిన కిలో మిర్చి ధర ప్రస్తుతం రెట్టింపుకు చేరింది. దీంతో పచ్చిమిర్చి కొనేందుకు వినియోగదారులు జంకుతున్నారు. పచ్చిమర్చి పంట సరిగా పండక పోవడంతో ధరలు భగ్గుమంటున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు అధికమై జనం బెంబేలెత్తుతున్న తరుణంలో కూరగాయల ధరలు మరింత ఇబ్బంది పెడుతున్నాయి. ఇదిలా ఉండగా టమాట ధర కిలో రూ.140 వరకు పలుకుతోంది. ఈ ధర గత నెలకంటే రెండు రెట్లు అధికంగా ఉంది. దీంతో పాటు ఉల్లిపాయల ధరలు, మునగకాయలు, ఆకు కూరల ధరలు రోజురోజుకూ స్వల్పంగా పెరుగుతున్నాయే తప్ప తగ్గే పరిస్థితి లేదు. అనుకున్న రీతిలో మిర్చి దిగుబడి రాకపోవడంతో పచ్చిమిర్చి ధర పిరమైంది. దీంతో రైతులతో పాటు వినియోగ దారులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు అందక పోవడంతో పాటు అకాల వర్షాలు కురియటంతో దిగుబడిపై ప్రభావం పడింది. ఆశించిన స్థాయిలో దిగుబడి లేక డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మరో ప్రక్క పెళ్లిళ్ల సీజన కావడంతో టమాట, పచ్చిమిర్చితో పాటు అన్ని రకాల కూరగాయలు ధరలు పెరిగిపోయాయి. పెరిగిన యాంత్రిక జీవనంతో జీవన విధానం కూడా మారిపోయింది. ఇంటి పెరటిలో పండించుకునే చిన్న చిన్న పంటలను కూడా బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఉత్పత్తి కంటే డిమాండ్ అధికంగా ఉంది. తద్వారా రేట్లు మండిపోతున్నాయి. గతంలో పల్లెల్లో పచ్చిమర్చి, టమాట,బెండ, వంకాయ, దొండ కాయ వంటివి పెరళ్లలో పండించే వారు. ఇప్పుడు అంతా పల్లెలను వదిలి పట్టణాలకు బతుకు దెరువు కోసం పరుగులు తీస్తున్న క్రమంలో పల్లె పెరళ్లు బోసిపోతున్నాయి. ఇదిలా ఉండగా పట్టణాల్లో ఉండే మిద్దేల్లో సైతం కుండీలు, తొట్లలో రసాయన రహిత కూరగాయలు, ఆకు కూరలు పండించుకునే పరిస్థితి ఉన్నా ఆదిశగా ఎవరూ అడుగులు వేయడం లేదు. ఇప్పటికైనా ఉధ్యానవన శాఖ ఆ దిశగా ప్రయత్నాలు సాగించాలని, పల్లెల్లో పెరళ్లు అందుబాటులు ఉన్న వారికి ఉచితంగా మిర్చి, టమాట,కూరగాయల విత్తనాలు అందజేసి ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

## 5న రెండు ముక్కలుగా బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. బిజెపితో 30 ఏళ్ళు కలిసి ప్రయాణం చేసినప్పటికీ, ఆ పార్టీలో తాము విలీనం కాలేదని గుర్తు చేశారు. జూన్ 5వ తేదీన నువ్వు మాజీ ప్రధానివి అవుతావని దేశంలోని ఓటర్లు నిర్ణయించుకున్నారని థాక్రే అన్నారు. జూన్ 5న నీ పార్టీకి ఏమవుతుందంటే, అది చీలిపోతుందన్నారు. 75 ఏళ్ళు పూర్తయిన తరువాత రాజకీయాల్లో కొనసాగుతారో లేదో అనే విషయాన్ని మోదీ ప్రకటించాలని ఉద్ధవ్ సవాలు విసిరారు.

**మోదీ పేరుతో ఓట్లు అడిగినందుకు సారీ**

2014, 2019 ఎన్నికలలో మోదీ పేరుతో ఓట్లు అడిగినందుకు ఉద్ధవ్ థాక్రే క్షమాపణ చెప్పారు. మహారాష్ట్రకు బిజెపి, మోదీ వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఈ రాష్ట్రం వారికి 40కి పైగా ఎంపిలను ఇచ్చినప్పటికీ, గుజరాత్‌లోనే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని, మహారాష్ట్ర, గుజరాత్ రైతుల మధ్య వివక్ష ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఉల్లిగడ్డలను ఎగుమతి చేసుందుకు గుజరాత్‌లో అనుమతించి, మహారాష్ట్రలో అనుమతించలేదన్నారు.

## ఇడి అరెస్టు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలనుకుంటే.. అప్పుడు దర్యాప్తు సంస్థ ప్రత్యేక కోర్టులో దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై న్యాయస్థానం విచారణ జరుపుతుంది. ఇడి కారణాలతో కోర్టు సంతృప్తి చెందితేనే కస్టోడియల్ విచారణకు అనుమతినిస్తుంది' అని సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. మనీలాండరింగ్ కేసుల్లో ఇడి స్వాధీనం చేసుకున్న మెటీరియల్ ఆధారంగా ఓ వ్యక్తి నేరానికి పాల్పడ్డాడని దర్యాప్తు సంస్థ విశ్వసిస్తే అప్పుడు సెక్షన్ 19 కింద నిందితుడిని అరెస్టు చేసే అధికారం ఉంటుంది. అయితే, అరెస్టుకు గల కారణాలను ఇడి సదరు వ్యక్తికి వీలైంతన త్వరగా తెలియజేయాల్సి ఉంటుంది.

## 117 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

**జయశంకర్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**




ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : యసంగి ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల పై వ్యవసాయ శాఖ, సహకార శాఖ, తూనికలు కొలతలు, మార్కెటింగ్, డిఆర్డీఏ పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ, యసంగి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా117 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 16 వేల 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు.వాతావరణంలో మార్పుల వల్ల అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటివరకు 3వేల టార్పలిన్ లు కొనుగోలు కేంద్రాలకు అందజేశామన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, డిఆర్డిఓ నరేష్, పౌర సరఫరాల అధికారి నర్సింగరావు, జిల్లా సివిల్ సప్లై సంస్థ మేనేజర్ రాఘవేందర్, తూనికలు కొలతల శాఖ అధికారిశ్రీలత,మార్కెటింగ్అధికారి కనక శేఖర్, అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com